epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 197 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 27 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# ఇంటింటికీ ఇందిరమ్మ బీమా!

## సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు



- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు
- జూన్ 2 నుంచి 12 వరకు ఘనంగా 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ఇంటింటికీ చేర్చేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ప్రత్యేక లోగోతో కూడిన స్టిక్కర్లు అతికించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. 2

# నాగేశ్వర్ అరెస్ట్‌పై ఉత్కంఠ!

- పవన్‌పై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- డీజీపీ ఆనంద్‌ను కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్
- ఏపీ పోలీసులు వస్తారన్న ప్రచారంతో టెన్షన్



జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నాగేశ్వర్ రావు నివాసం వద్ద తెలంగాణ పోలీసులు మోహరించడం చర్చనీయాంశమైంది. 2



# ఒకటో తారీఖునే జీతాలు

## పంచాయతీ ఉద్యోగులకు సీఎం గుడ్‌న్యూస్!

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 50 వేల మందికి పైగా సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు ఒకటో తేదీన జీతాలు ఎలా వస్తాయో.. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ ఉద్యోగులకు కూడా అదే విధంగా వేతనాలు అందాలని స్పష్టం చేశారు. మంగళవారం సెక్రటేరియట్‌లో పంచాయతీరాజ్ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- 50 వేల మందికి సమయానికి వేతనాలివ్వాలని ఆదేశం
- జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- పెన్షన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేయాలి

**హైదరాబాద్, మే 27:** రాష్ట్రంలోని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు ప్రతి నెల తొలి తేదీకే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీతాల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన పంచాయతీరాజ్ శాఖ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 50 వేలకుపైగా గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ప్రతి నెల జీతాలు సమయానికి అందేలా మిగతా 2 లో

## ఎబోలాపై భయమే వద్దు!

- తెలంగాణలో ఒక్క కేసు లేదు
- ఎయిర్‌పోర్ట్‌లలో హై అలర్ట్..
- గాంధీలో ఐసోలేషన్ వార్డు సిద్ధం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

.. వివరాలు 2లో







# మహానాడు మంత్రం.. మహిళా శక్తే అస్త్రం!

- నేటి నుంచి టీడీపీ మహానాడు ప్రారంభం
- 2029 విజయ లక్ష్యంగా బాబు దిశానిర్దేశం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ తొలి మహానాడు
- వర్చువల్ వేదికగా శ్రేణులకు కొత్త సందేశం

తెలుగుదేశం పార్టీకి మహానాడు అంటే కేవలం రాజకీయ సభ కాదు... అది పార్టీ శక్తి ప్రదర్శన.. భవిష్యత్ కార్యాచరణకు బ్లూప్రింట్.. శ్రేణుల్లో ఉత్సాహం నింపే రాజకీ య మహోత్సవం. ఎన్టీఆర్ ఆవిష్కరించిన మహానాడు సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. 2026 మహానాడుకు టీడీపీ సర్వం సిద్ధం చేసింది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు 2029 ఎన్నికల వ్యూహంపై కీలక చర్చలు జరగనున్నాయి. .. వివరాలు 5లో



..5లో

## ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

- రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత
- ఫలితాలు ప్రకటించిన మంత్రి లోకేష్
- బీఎడ్ ప్రవేశాలకు మార్గం సుగమం



..5లో

## పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

డిప్యూటీ సీఎం పవన్

# భానుడి భగభగలు 2

- ఆలస్యం కానున్న నైరుతి రుతుపవనాల రాక
- రాష్ట్రవ్యాప్తంగా నిప్పుల కొలిమిలా మారిన జిల్లాలు
- వడదెబ్బతో ఒక్కరోజే 42 మంది మృతి
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరిక





## దేశంలో అసహజ జనాభా మార్పు

ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
హోంమంత్రి అమిత్ షా వెల్లడి

.. వివరాలు 4లో

# నగరానికి నీటి భద్రతే లక్ష్యం

## హైదరాబాద్ జలమండలికి రూ.11,900 కోట్ల అభివృద్ధి పనులు

- గోదావరి ఫేజ్-2, 3తో భవిష్యత్ అవసరాలకు సిద్ధం
- వర్షపు నీటి సంరక్షణపై ప్రజలు భాగస్వామ్యం కావాలి : మంత్రి పొన్నం

3





## ఒకటో తారీఖునే జీతాలు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.59 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఐఏఎస్ అధికారులకు ఎలా సమయానికి జీతాలు అందుతున్నాయో.. గ్రామ పంచాయతీ ఉద్యోగులకు కూడా అదే విధంగా వేతనాలు అందాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఒకేసారి జీతాలు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా కూడా సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70(3) సవరణకు అనుగుణంగా.. గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలకు కాకుండా నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణలు చేయాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన ఈ విధానాన్ని తిరిగి అమల్లోకి తీసుకురావాలని సీఎం నిర్ణయించారు. పెన్షన్ల పంపిణీ వ్యవస్థపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఇకపై పోస్టల్ శాఖ ద్వారా కాకుండా.. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే పెన్షన్లు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ ఐడీ, ఆధార్, సంబంధిత ప్రభుత్వ డేటా ఆధారంగా పెన్షన్ వ్యవస్థను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. కొత్తగా మంజూరు చేసే పెన్షన్లలో ఒంటరి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో అర్హులైన మహిళలు ఎవరూ నష్టపోకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.

## నాగేశ్వర్ అరెస్ట్‌పై ఉత్కంఠ!

### పవన్‌పై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

### డీజీపీ ఆనంద్‌ను కలిసి రక్షణ కోరిన ప్రొఫెసర్ నాగేశ్వర్


### ఏపీ పోలీసులు వస్తారన్న ప్రచారంతో టెన్షన్



**హైదరాబాద్, మే 26:** జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నాగేశ్వర్ రావు నివాసం వద్ద తెలంగాణ పోలీసులు మోహరించడం చర్చనీయాంశమైంది. ఏపీ పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని కోరినట్లు సమాచారం. అనంతరం మీడియాతో మాట్లాడిన నాగేశ్వర్.. సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నానని స్పష్టం చేసిన నాగేశ్వర్.. ఇప్పటివరకు ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇటీవల ఓ టీవీ చానెల్‌లో పవన్ కళ్యాణ్‌పై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై ఏపీలో పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు చేరుకున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖండించింది. ఇదంతా అసత్య ప్రచారమేనని స్పష్టం చేసింది. ఇక తెలంగాణలో అరెస్ట్ చేయాలంటే స్థానిక పోలీసుల అనుమతి అవసరమని, లేకుంటే అది అక్రమ అరెస్టుగా పరిగణించే అవకాశం ఉందని న్యాయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ఏ విధంగా స్పందిస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఒకవేళ అరెస్ట్ ప్రయత్నాలు జరిగితే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో నాగేశ్వర్ ఉన్నట్లు సమాచారం.

## 'టీ-వర్క్స్'ను తీసుకొచ్చింది కేసీఆరే

### ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్




**హైదరాబాద్, మే 26 :** తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు 'టీ-వర్క్స్' అని, దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చింది కేసీఆరే అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా టీ-వర్క్స్ పురోగతి, దాని ప్రాధాన్యతపై ఆయన సుదీర్ఘంగా స్పందించారు. టీ-వర్క్స్ అనేది కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టి, నేడు యువత చేతుల్లో ఒక గొప్ప సాంకేతిక శక్తిగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. స్టార్టప్‌లకు కేవలం మాటల ప్రోత్సాహం మాత్రమే ఇవ్వకుండా.. ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లకు పూర్తి స్వేచ్ఛను నాటి భారాస ప్రభుత్వం కల్పించిందని గుర్తుచేశారు. నేడు దేశం మొత్తం డ్రోన్లు, డిఫెన్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గురించి మాట్లాడుతుండగా.. తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే కేసీఆర్ నాయకత్వంలో పడిందని వివరించారు. "టీ-వర్క్స్ అనేది కేవలం ఒక భవనం కాదు.. అది తెలంగాణ యువత కలలకు రెక్కలు తొడిగిన ప్రయోగశాల. 'మేక్ ఇన్ తెలంగాణ' అనే ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు ప్రతీక" అని కేటీఆర్ కొనియాడారు. దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ సెంటర్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి, నగరాన్ని అంతర్జాతీయ ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టిన దూరదృష్టి కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న ఈ సంస్థ.. తెలంగాణ అభివృద్ధి ఎంతటి ముందుచూపుతో, ప్రణాళికాబద్ధంగా సాగిందో మరోసారి నిరూపిస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఇంటింటికీ 'ఇందిరమ్మ బీమా'!

- జూన్ 2 నుంచి 12 వరకు ఘనంగా 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు
- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, మే 26:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను జూన్ 2 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించిన కమిటీ, ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. జూన్ 2 నుంచి 12 వరకు రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా--శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలు లేకుండా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రులు స్పష్టం చేశారు.

### ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా' రక్షణ

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఇంటి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. ఎవరైనా మిగిలిపోతే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారి వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భారీ ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి ప్రత్యేక లోగో రూపొందించనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఆ లోగోతో కూడిన స్టిక్కర్ అతికించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజ్, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానియా, గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎబోలాపై భయమే వద్దు!

### తెలంగాణలో ఒక్క కేసు లేదు

### ఎయిర్‌పోర్ట్‌లలో హై అలర్ట్..

### గాంధీలో ఐసోలేషన్ వార్డు సిద్ధం

### అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం

### మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మే 26:** ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించలేదన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించిందని వెల్లడించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల నుంచి వచ్చే వారికి థర్మల్ స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామని, గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డును సిద్ధంగా ఉంచామని మంత్రి తెలిపారు. డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. అనుమానితుల నమూనాలను మహారాష్ట్రలోని పుణెలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ఎబోలా ప్రభావిత దేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారని, వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని స్పష్టం చేశారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా వారిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి వెల్లడించారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించిన మంత్రి దామోదర రాజనర్సింహ.. ప్రజారోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

## ఓటరు జాబితాలో గందరగోళానికి నో ఛాన్స్!

- అర్హులందరికీ ఓటు హక్కు.. అనర్హుల పేర్లకే కత్తెర
- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అధికారులకు ఈసీ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, మే 26:** రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని, అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి పాల్గొన్నారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియను నిరంతరం సమీక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఎన్యూమరేషన్ ఫారాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రత్యేక అవార్డులతో సత్కరించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు.



## జూపల్లి ఆదేశాలతో అన్‌లోడింగ్ సమస్య

**నాగర్ కర్నూల్, మే 26:** మంత్రి జూపల్లి ఆదేశాలకు భయపడి అధికారులు నాగర్ కర్నూల్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడూర్ మండలం పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులోని మణికంఠ కాటన్ మిల్లు గోదాం దగ్గర మొక్కజొన్న, ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్,పరిస్థితిని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్‌లోడింగ్ సమస్యను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నేరుగా గోదాంకు వెళ్లి రైతుల ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కేవలం మంత్రి జూపల్లి ఆదేశాలతో కొల్లాపూర్‌కు చెందిన దళారుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొల్లాపూర్‌కు చెందిన 30 లారీల ధాన్యం అన్‌లోడ్ చేశారని ఆరోపించారు.

## భానుడి భగభగలు

### ఆలస్యం కానున్న నైరుతి రుతుపవనాల రాక


### రాష్ట్రవ్యాప్తంగా నిప్పుల కొలిమిలా మారిన జిల్లాలు

### వడదెబ్బతో ఒక్కరోజే 42 మంది మృతి

### పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరిక

**హైదరాబాద్, మే 26:** ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీనితో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి కార్తె రెండో రోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ, వాతావరణ మార్పుల వల్ల జూన్ 5 నుంచి 10 వరకు ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నట్లు హెచ్చరించింది. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూరులో 46.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉంటాయని వెల్లడించింది. దీనితో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42 మంది మృతి చెందారు. ఒక్క వరంగల్ లోనే అత్యధికంగా 20 మంది మరణించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 మంది, కరీంనగర్ లో 8 మంది, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాత పడ్డారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిశాయి. ముఖ్యంగా నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. కామారెడ్డి, మెదక్,పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురవగా, హయాత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ పేర్కొన్నది.





# తెలంగాణలో అవినీతి రాజ్యం

**అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**శంషాబాద్‌లో 180 ఎకరాల భూమి స్వాహా**

**సింగరేణిలో 1600 కోట్ల బొగ్గు మాయం**

**ప్రభుత్వంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్, మే 26:** తెలంగాణలో ప్రస్తుతం అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. భూముల ఆక్రమణలు, రెవెన్యూ శాఖలో వేల కోట్ల కుంభకోణాలు, సింగరేణిలో బొగ్గు అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని హరీశ్ రావు ఆరోపించారు. ఈ భారీ కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని, దీనిపై సిట్ లేదా సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ భూమిని అప్పగించిన తహసీల్దార్‌ను కేవలం బదిలీ చేసి సరిపెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు తహసీల్దార్‌ను వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదేనని ఆర్డీఓ స్పష్టంగా చెబుతున్నా, ఉన్నతాధికారుల మాట వినకుండా తహసీల్దార్ మాత్రం ప్రైవేట్ భూమి అని వాదించడం వెనుక పెద్దల హస్తం ఉందన్నారు. ఈ అక్రమాల వెనుక సీసీఎల్ఏ ఉన్నారా లేక కలెక్టర్ ఉన్నారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సన్నిహితుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల వల్లే తహసీల్దార్‌పై చర్యలు తీసుకోకుండా అవినీతి నిరోధక శాఖ అధికారులు సైతం వెనక్కి తగ్గారని ఆరోపించారు. సింగరేణిలో సుమారు 16 వందల కోట్ల రూపాయల విలువైన లక్షలాది టన్నుల బొగ్గు మాయమైందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అసలు అక్కడ బొగ్గు ఉందో లేదో తేల్చడానికి ఒక అఖిలపక్ష బృందాన్ని అక్కడికి తీసుకెళ్లాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి సంస్థ కుంభకోణాలకు నిలయంగా మారిందని విమర్శించారు. "కాంగ్రెస్ హటావో – సింగరేణి బచావో" అనేది ఇప్పుడు సింగరేణి గని కార్మికుల నినాదం కావాలని పిలుపునిచ్చారు. నైని బ్లాక్ బొగ్గు గనుల టెండర్ల వ్యవహారమే కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి నిదర్శనమన్నారు. త్వరలోనే సింగరేణికి సంబంధించిన మరిన్ని అక్రమాలను బయటపెడతానని హెచ్చరించారు. రైతుల వద్ద ధాన్యాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు గాను ఆర్టీసీ డ్రైవర్ అశోక్ పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు**

**కరీంనగర్, మే 26 :** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



# నగరానికి నీటి భద్రతే లక్ష్యం

- హైదరాబాద్ జలమండలికి రూ.11,900 కోట్ల అభివృద్ధి పనులు
- గోదావరి ఫేజ్-2, 3తో భవిష్యత్ అవసరాలకు సిద్ధం
- వర్షపు నీటి సంరక్షణపై ప్రజలు భాగస్వామ్యం కావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 26:** హైదరాబాద్ నగరానికి నిరంతరాయ తాగునీటి సరఫరా, డ్రైనేజీ మౌలిక వసతుల బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ప్రధాన కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజహరుద్దీన్‌తో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, డైరెక్టర్ సుదర్శన్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగరంలో తాగునీటి సరఫరా, వేసవిలో ట్యాంకర్ సేవలు, వర్షాకాల సన్నద్ధత, మౌలిక వసతుల అభివృద్ధి పనులు, ఎస్టీపీల నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నగరానికి ప్రస్తుతం రోజుకు 650 ఎంజీడీల తాగునీరు సరఫరా అవుతోందని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.7,000 కోట్ల వ్యయంతో గోదావరి ఫేజ్–2, ఫేజ్–3 పనులు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్తులో కృష్ణా ఫేజ్–4, ఫేజ్–5 ప్రాజెక్టులతో పాటు సింగూరు పైప్‌లైన్ ప్రాజెక్టును కూడా అమలు చేస్తామని వెల్లడించారు. నగరంలో ప్రస్తుతం 14.50 లక్షల ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని, అందులో 6.23 లక్షలు ఉచిత నీటి కనెక్షన్లేనని మంత్రి వివరించారు. తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. నగరంలో 6.14 లక్షల మ్యాన్‌హోల్స్ ఉన్నాయని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్, మే నెలల్లో భారీ స్థాయిలో డీసిల్టింగ్, శుభ్రపరిచే పనులు చేపడుతున్నామని చెప్పారు. గత ఏడాది భారీ వర్షాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నీటిమునిగే సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వేసవి కాలంలో ట్యాంకర్ సేవలు సమర్థంగా కొనసాగుతున్నాయని, దాదాపు 95 శాతం ట్యాంకర్ బుకింగ్స్ 24 గంటల్లోనే సరఫరా చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. భూగర్భ జలాల సంరక్షణ అత్యంత అవసరమని, ప్రతి ఇంటి వద్ద సాధ్యమైనంత వరకు రైన్‌వాటర్ హార్వెస్టింగ్ గుంతలు నిర్మించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్షపు నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని కోరారు. రైన్‌వాటర్ హార్వెస్టింగ్ చేపట్టిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. అదే సమయంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టకుండా తరచూ ట్యాంకర్లపై ఆధారపడే వినియోగదారులపై భవిష్యత్తులో డబుల్ ఛార్జీలు విధించే అవకాశముందని హెచ్చరించారు. డ్రైనేజీ లైన్లపై అక్రమ నిర్మాణాలను కఠినంగా తొలగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నగరానికి అదనంగా ఒక్క ఎంజీడీ నీటిని కూడా తీసుకురాలేదని విమర్శించారు. తాగునీటి సమస్యలను రాజకీయాలకు వేదిక చేయొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. తాగునీటి దుర్వినియోగంపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో కొత్త హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చే ముందు నీటి సరఫరా సామర్థ్యం, మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలను కచ్చితంగా పరిశీలిస్తామని తెలిపారు. వాటర్ బోర్డులో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ విజయ రహస్యం

- ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- భారీగా విదేశీ పెట్టుబడులు, పారదర్శక కుల గణన
- రాబోయే స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ ఖాయం
- కార్యకర్తల కష్టాన్ని పార్టీ తప్పక గుర్తిస్తుంది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**కామారెడ్డి, మే 26:** నిజామాబాద్ ఉమ్మడి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించబడింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున అధ్యక్షుడుగా జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, టీపీసీసీ కోఆర్డినేటర్లు, జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి సన్న బియ్యం పంపిణీ వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో ప్రభుత్వం విజయవంతమైందని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన కొనియాడారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కల్లాల్లో రైతులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల ప్రభుత్వం అని, బీఆర్ఎస్ పాలనతో కాంగ్రెస్ పాలనకు స్పష్టమైన తేడా కనిపిస్తోందన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయాలు సాధించిందని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇల్లు లేని పేదలకు గృహాలు అందించడం కాంగ్రెస్ అగ్రనేతల ఆశయమని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ధైర్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని వివరించారు.

# రైతు గోడు వినిపిస్తే సస్పెన్షనా?

- ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడిన ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు వివాదం
- అశోక్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో ఆగ్రహ జ్వాలలు



**జగిత్యాల, మే 26:** రైతుల సమస్యలపై స్పందిస్తూ వ్యాఖ్యలు చేసిన జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై చర్యలు తీసుకోవడంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. "ముందు ధాన్యం, మక్కలు కొనండి.. తర్వాత పెట్రోల్ ధరలు తగ్గించండి" అంటూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అతనిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ప్రజా సమస్యలపై గొంతెత్తిన వారిపై ప్రభుత్వం అణచివేతకు దిగుతోందంటూ నెటిజన్లు మండిపడుతున్నారు.

**అసలు ఏం జరిగింది..?**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ జగిత్యాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సంజయ్ పాల్గొన్నారు. అదే సమయంలో బస్‌స్టాండ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును పోలీసులు దారి మళ్లించారు. బస్సు నడుపుతున్న డ్రైవర్ అశోక్, తన గ్రామానికి చెందిన వ్యక్తితో మాట్లాడుతూనే "ముందు వడ్లు, మొక్కజొన్నలు కొనండి.. తర్వాత పెట్రోల్ ధరలు ఎప్పుడైనా దించుకోవచ్చు" అని వ్యాఖ్యానించినట్లు వీడియోల్లో కనిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం చెలరేగింది. అనంతరం తనను విధులకు రాకూడదని ఆర్ఎం కార్యాలయం నుంచి లేఖ వచ్చినట్లు అశోక్ వెల్లడించారు. ఐదు డిపోల్లో తనకు డ్యూటీలు వేయొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దీంతో రైతు సమస్యలపై మాట్లాడినందుకే చర్యలు తీసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**"నేను ఎవరినీ విమర్శించలేదు"**

ఈ వ్యవహారంపై అశోక్ స్పందిస్తూ.. "నేను ఏ రాజకీయ పార్టీని గానీ, ఏ నాయకుడిని గానీ ఉద్దేశించి మాట్లాడలేదు. రైతుల ఇబ్బందుల గురించి మాత్రమే మాట్లాడాను. మా ఊరి వ్యక్తితో మాట్లాడుతున్న సమయంలో ఆ మాట అన్నాను" అని వివరణ ఇచ్చారు.

**గంగుల హెచ్చరిక**

డ్రైవర్ అశోక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి గంగుల కమలాకర్ హెచ్చరించారు. రైతుల సమస్యలను ప్రస్తావించినందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు.

**"తొలగింపు వార్తలు అవాస్తవం" : మంత్రి పొన్నం**

ఇదిలా ఉండగా డ్రైవర్ అశోక్‌ను ఉద్యోగం నుంచి తొలగించారనే వార్తలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. అశోక్ ఆర్టీసీ శాశ్వత ఉద్యోగి కాదని, హైర్ బస్సు డ్రైవర్ మాత్రమేనని స్పష్టం చేశారు. అయినప్పటికీ అతన్ని విధుల నుంచి తొలగించవద్దని సంబంధిత యాజమాన్యానికి సూచించామని తెలిపారు. రైతుల సమస్యలపై చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం సానుకూలంగానే తీసుకుంటుందని, ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికే చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.



# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి!

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మ-రణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది. ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జెంగన్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల విదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై-రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

■ ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, మే 26:** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను



కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా-గ్గంట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# వాహనదారులపై మళ్లీ పిడుగు

## సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం

## వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు

**న్యూఢిల్లీ, మే 26:** కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం..




ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

# దేశంలో అసహజ జనాభా మార్పు

## ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు : హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**న్యూఢిల్లీ, మే 26 :** అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు. మత, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా మార్పుల సరళని కమిటీ విశ్లేషిస్తుందని చెప్పారు.



# అమెరికాలో కాల్పులు

## సూపర్ మార్కెట్‌లో కాల్పుల్లో భారతీయ మహిళ మృతి

**వాషింగ్టన్, మే 26:** అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వర్జీనియా రాష్ట్రంలోని ఒక సూపర్ మార్కెట్‌లో మే 23 శనివారం గుజరాత్‌కు చెందిన భారతీయ మహిళ దారుణ హత్యకు హత్యకు గురయ్యారు. మృతురాలు బిజాపుర్ ప్రాంతంలో మెహసానా జిల్లా జంత్రాల్ గ్రామానికి చెందిన మేఘనా పటేల్‌గా గుర్తించారు. మేఘ్నా పటేల్ దుకాణం లోపల ఉండగా.. ఆ సమయంలోనే ఓ దుండగుడు కస్టమర్ తరహాలో లోపలికి వచ్చి సెకన్ల వ్యవధిలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. దుండగుడు ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. ఈ కాల్పులు దోపిడీ ఉద్దేశంతోనే జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# మరోమారు పెరోల్‌పై బయటకు డేరాబాబా

## 9 ఏళ్లలో 16 సార్లు పెరోల్ పొందిన గుర్మీత్

**న్యూఢిల్లీ, మే 26:** అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ అలియాస్ డేరా బాబా మరోసారి 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలోని సునారియా జైలు నుంచి మంగళవారం బయటకు వచ్చారు. 2017లో శిక్ష పడిన తర్వాత ఆయనకు 16వసారి పెరోల్ లభించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ మరోసారి పెరోల్‌పై విడుదలయ్యారు. 2017లో అతడికి శిక్ష పడిన నాటినుంచి పెరోల్‌పై తాత్కాలికంగా విడుదలవడం ఇది 16వ సారి. శిక్ష అనుభవిస్తున్న గత 9 ఏళ్లలో 400 రోజులకు పైగా అతడు జైలు బయటే గడిపాడు. ప్రస్తుత పెరోల్ కాలంలో డేరా బాబా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలోనే ఉంటారని న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 2002లో ఒక జర్నలిస్టు హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు డేరా బాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా.. ఏడేళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ తర్వాత, తన శిష్యురాళ్లపై లైంగిక వేధింపుల కేసులో 2017లో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. నాటినుంచి జైల్లోనే ఉంటున్నాడు. 2020 నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో



16 సార్లు పెరోల్‌పై విడుదలై.. రోజులతరబడి బయటే తిరుగుతున్నారు. ఇప్పటికి గుర్మీత్ శిక్ష ప్రారంభమై 9 ఏళ్లు అవుతోంది. ఈ 9 ఏళ్ల కాలంలో ఆయన 400 రోజులకు పైగా జైలు బయటే గడిపారు. ప్రస్తుత పెరోల్ కాలంలో గుర్మీత్.. సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కేంద్రంలో ఉండనున్నారు. అధికారులు కఠిన నిఘా మధ్య ఆయనను అక్కడికి తరలించినట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయాల్లో కూడా రామ్ రహీమ్‌కు పెరోల్ మంజూరు కావడం వివాదాస్పదమైంది. ప్రతిపక్ష పార్టీలు దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రామ్ రహీమ్ విడుదలయ్యే ప్రతిసారీ ఆయన అనుచరులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈసారి కూడా హరియాణా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

# ఒడిషాలో విషాదకర ఘటన

## సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు కూలీల మృతి

భువనేశ్వర్, మే 26: ఒడిశాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఊపిరాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కళహండి జిల్లాలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో సెంట్రింగ్ తీయడానికి మేస్త్రి దిగాడు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి సెంట్రింగ్ తీస్తున్న సమయంలో అది కూలిపోయింది. దీంతో మేస్త్రి అందులో చిక్కుకుపోయాడు. మేస్త్రిని కాపాడేందుకు మరో ఐదుగురు సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగారు. లోపలికి దిగిన ఆ ఐదుగురు కూడా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు వెంటనే స్పందించి మొత్తం ఆరుగురిని వెలికి తీశారు. హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తరలించే సమయానికే వారు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మేస్త్రిలు, ఒక కార్మికుడు, ఇంటి యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.



# ఇది పవన్ మార్క్ పనిష్మెంటా?!

## మండుటెండలో అధికారులు, ప్రజాప్రతినిధులకు క్లాస్

## పవన్ ఒక్కరే గొడుగు నీడన..

## కలెక్టర్, ఎమ్మెల్యే గోరంట్ల, అధికారులు ఆపసోపాలు

**రాజమహేంద్రవరం, మే 26:** కాలుష్య కోరల్లో చిక్కుకున్న గోదావరమ్మను చూసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఆగ్రహం కట్టలు తెంచుకుంది కాబోలు. 'కాలుష్య రహిత గోదావరి' నినాదంతో రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని ఉన్న గోదావరి నదిని ఆద్యంతం పరిశీలించారు. వచ్చే సంవత్సరం పుష్కరాల నేపథ్యంలో సాధ్యమైనంత వరకు గోదావరి నది ప్రక్షాళన చేయాలన్నది బహుశా పవన్ కళ్యాణ్ సంకల్పం కావచ్చు. అభినందించదగిన విషయమే. కాకపోతే కాస్త అతి చేశారనే విమర్శలు నగరంలో వినిపిస్తున్నాయి. ప్రధానంగా మండుటెండలో..ప్రజాప్రతినిధులను, జిల్లా కలెక్టర్ ను సైతం నిలబెట్టి క్లాస్ తీసుకోవడం ఎబ్బెట్టుగా అనిపించింది. ఇదేదో తప్పు చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు పనిష్మెంట్ ఇచ్చినట్లుగా ఉందని ప్రతిపక్షాలే కాదు..నగర వాసులు సైతం వ్యాఖ్యానించడం గమనార్హం. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా వారికిలానే ఎండలో ఉండి..క్లాస్ తీసుకుంటే ఈ విమర్శలు వచ్చేవి కావేమో. ఆయన మాత్రం దొరలా పెద్ద గొడుగు నీడన నిలబడి.. అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు విమర్శలకు తావిచ్చింది. దశాబ్దాల తరబడి గోదావరి కాలుష్యంపై నగర వాసులు, ప్రజాప్రతినిధులు వివిధ రూపాలలో ఆందోళనలు చేశారు. అయినా ఏపీ పేపర్ మిల్లు, తదితర పరిశ్రమల యాజమాన్యాలు "ప్రజల ఆరోగ్యం కంటే..మా వ్యాపారమే ముఖ్యం" అన్న మాదిరిగా వ్యవహరిస్తూ వస్తున్నాయి. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ "పుష్కరాల" నేపథ్యంలో ఆ గోదావరి మాతే "పవన్ కుమారా..నన్ను కాలుష్య కోరల నుంచి విడిపించవూ" అని కోరినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం రావటం..ఒక రోజు షెడ్యూల్ కాస్తా మరో రోజుకు పొడిగించి..'గోదావరి నదిని కాలుష్యం చేస్తున్న వారి అంతు చూడ్డానికి' కంకణం కట్టుకోవడం ప్రశంసనీయం. కాకపోతే..ఎండలు..ఆషామాషీ ఎండలు కాదు..రోహిణి కార్తి ఎండలు. అంత మండుటెండలో అధికార అనధికారులను నిలబెట్టి.. పవన్ అసహనం వ్యక్తం చేయడం, మంత్రి కందుల దుర్గేష్ పై సీరియస్ అవడం..అవసరమా..పదిమందిలో నేరస్థుల్లా నిలదీయాల్సిన అవసరం ఉందా అనే విమర్శలు ఇప్పుడు నగరంలో వినిపిస్తున్నాయి. జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ ను మహిళ అని కూడా చూడకుండా నిలబెట్టి సూచనలు, అక్కడక్కడ అసహనం వ్యక్తం చేయటం మాత్రం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తగదని అంటున్నారు. ఇది రాజకీయ వ్యూహంలో భాగమా, లేక నిజంగానే గోదావరిని చూసి పవన్ చలించారా అనేది ప్రస్తుతం అప్రస్తుతం. కాకపోతే పదవికి తగ్గట్టుగా హుందాగా వ్యవహరిస్తే అందరూ హర్షించేవారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. "గోదావరి గలగల కాదు..కాలుష్యంతో విలవిల', నదిని మురికిగా ఉంచి, భక్తులను పవిత్ర స్నానాలు చేయమనడం ప్రజలను వంచిండమే అవుతుందని..ఇంత కలుషిత నీటిలో స్నానాలు చేస్తే పుణ్యం వస్తుందో లేదో తెలియదు కానీ, జబ్బులు రావడం మాత్రం ఖాయమని' ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటల్లో నూరు శాతం వాస్తవం ఉంది. కాకపోతే అంత మండుటెండలో ఎందుకు జిల్లా కలెక్టర్ ను, జిల్లా స్థాయి అధికారులను, మంత్రులను, ప్రజాప్రతినిధులను 'అంతసేపు' నిలబెట్టి సీరియస్ అయ్యారో పవన్ అంతరంగం ఎవరికీ తెలియదు.

# ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

## రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత : ఫలితాలు ప్రకటించిన మంత్రి లోకేష్



**అమరావతి, మే 26 :** ఆంధ్రప్రదేశ్‌లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఎడ్‌సెట్–2026 ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్షలో రికార్డు స్థాయిలో తొంభై తొమ్మిది పాయింట్ మూడు శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి వెల్లడించారు. ఫలితాల ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం పంతొమ్మిది వేల ఎనిమిది వందల ఎనభై మంది అభ్యర్థులు హాజరయ్యారని మంత్రి తెలిపారు. వారిలో పంతొమ్మిది వేల ఏడు వందల నలభై ఒకరు అర్హత సాధించినట్లు వెల్లడించారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులందరికీ మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మంచి ఉపాధ్యాయులుగా ఎదిగి విద్యారంగానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ఫలితాలు, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అదనంగా వాట్సాప్ సేవ ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నంబర్ ద్వారా అభ్యర్థులు సులభంగా తమ ర్యాంకులను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తదుపరి కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ విద్యా కళాశాలల్లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు ఈ కౌన్సెలింగ్ ఆధారంగానే కల్పించనున్నారు. కౌన్సెలింగ్ తేదీలు, ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యకు మంచి ఆదరణ లభిస్తోందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అధిక శాతం ఉత్తీర్ణత నమోదవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయడంలో బీఎడ్ కోర్సులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఫలితాల విడుదల అనంతరం అభ్యర్థులు పెద్దఎత్తున ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి విజయాన్ని జరుపుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తదుపరి ప్రవేశ ప్రక్రియ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మహానాడు మంత్రం.. మహిళా శక్తే అస్త్రం!

- నేటి నుంచి టీడీపీ మహానాడు ప్రారంభం
- 2029 విజయ లక్ష్యంగా బాబు దిశానిర్దేశం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ తొలి మహానాడు
- వర్చువల్ వేదికగా శ్రేణులకు కొత్త సందేశం



**విజయవాడ, మే 26:** తెలుగుదేశం పార్టీకి మహానాడు అంటే కేవలం రాజకీయ సభ కాదు... అది పార్టీ శక్తి ప్రదర్శన... భవిష్యత్ కార్యా చరణకు బ్లూప్రింట్... శ్రేణుల్లో ఉత్సాహం నింపే రాజకీయ మహోత్సవం. ఎన్టీఆర్ ఆవిష్కరించిన మహానాడు సంప్ర దాయాన్ని కొనసాగిస్తూ.. 2026 మహానాడుకు టీడీపీ స ర్వం సిద్ధం చేసింది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహానాడులో పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు 2029 ఎన్నికల వ్యూహంపై కీలక చర్చలు జరగనున్నాయి. ఈసారి "స్త్రీ శక్తి" థీమ్‌తో మహా నాడును నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. మహిళా సాధికారత, మహిళల రాజకీయ భాగస్వామ్యం, మహిళా సంక్షేమ పథకాలపై ప్రధానంగా చర్చించనున్నారు. మహిళలే భవిష్యత్ రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా మారతారనే సందేశాన్ని పార్టీ ఈ మహానాడు ద్వారా ఇవ్వ నుంది. మహానాడు వేదికగా మొత్తం 20 కీలక తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. అందులో 10 తీర్మానాలు ఆంధ్రప్రదేశ్‌కు, 4 తెలంగాణకు, ఒకటి అండమాన్‌కు సంబంధించినవి కాగా.. మరో నాలుగు ఉమ్మడి అంశాలపై ఉంటాయి. చివరగా రాజకీయ పరిస్థితులపై అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా పార్టీ శ్రేణులకు భవిష్యత్ దిశానిర్దేశం చేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పనితీరు, వచ్చే ఎన్నికల వ్యూహం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ మహానాడుకు మరో ప్రత్యేకత కూడా ఉంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో నారా లోకేష్ పాల్గొంటున్న తొలి మహానాడు ఇదే కావడంతో.. ఆయన ప్రసంగంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. యువత, సోషల్ మీడియా, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై లోకేష్ కీలక సందేశాలు ఇచ్చే అవకాశముంది. మహానాడు తొలి రోజు ఉదయం చంద్రబాబు పార్టీ కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తారు. పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన కార్యకర్తలను స్మరించుకుంటారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభ ఉపన్యాసం చేస్తారు. పార్టీ ఆర్థిక లెక్కల సమర్పణ తర్వాత చంద్రబాబు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. "స్త్రీ శక్తి", "కార్యకర్తే అధినేత", "పేదల సేవలో టీడీపీ" వంటి అంశాలపై చర్చలు జరుగనున్నాయి. రెండో రోజు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నివాళులర్పించి.. తెలుగుజాతి గౌరవం, రైతు సంక్షేమం, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, అభివృద్ధి, మౌలిక వసతులు, శాంతిభద్రతలు, సంపద సృష్టి వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదించనున్నారు. చివరగా చంద్రబాబు ముగింపు ప్రసంగంతో మహానాడు ముగియనుంది. ఈసారి మహానాడును పూర్తిగా కొత్త తరహాలో నిర్వహిస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపుకు మద్దతుగా వర్చువల్ విధానాన్ని టీడీపీ ఎంచుకుంది. పార్టీ పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యక్షంగా పాల్గొనగా.. మిగతా నేతలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు క్లస్టర్ల వారీగా వర్చువల్‌గా హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,800కు పైగా క్లస్టర్లలో భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి.. పండుగ వాతావరణంలో మహానాడును నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీడియో ప్రదర్శనలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు ఇంటరాక్షన్, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై చర్చలు ఈ మహానాడుకు మరింత ప్రాధాన్యతను తెచ్చిపెట్టనున్నాయి.

# రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం

## రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు

## అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



**అమరావతి,మే 26:** రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశుసంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

## ఆన్‌లైన్‌లో పన్నుల వసూళ్లతో పారదర్శకత మెరుగు

## రాజవోలు గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్ పన్నుల విధానాన్ని స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సీఎం



**రాజమహేంద్రవరం, మే 26 :** 'సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీ పన్నుల వసూలు ప్రక్రియ సరికొత్త మార్గంలో ముందుకు వెళ్లడం శుభపరిణామం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో మాన్యువల్ పద్ధతిలో పన్ను వసూళ్లు ఉండేవని, దీన్ని పూర్తిగా మార్చి మొత్తం ఆన్లైన్ విధానం తీసుకు వచ్చామని చెప్పారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులు మంగళవారం స్వయంగా పరిశీలించారు. రాజమండ్రి రూరల్ మండలం, రాజవోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ జరుగుతున్న పన్నుల వసూలు విధానాన్ని పరిశీలించారు. పన్నులను ఆన్లైన్లో కడుతున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంతో పని చేస్తుంది. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేస్తుంది. పంచాయతీలు స్వావలంబన సాధించాలంటే, ఆర్థికంగా వృద్ధి చెందాలి. స్వయంగా ఆదాయం ఆర్జించే స్థాయికి పంచాయతీలు రావాలి. ప్రతి అభివృద్ధి పనికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంతంగా అభివృద్ధి చేసుకునే దశకు పంచాయతీలు రావాలి. దీనికోసం ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోంది. నూతన విధానాలను పంచాయతీలు కూడా అందిపుచ్చుకొని, పన్నులు గ్రామ ప్రగతికి పునాదులు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి" అన్నారు. పవన్ కళ్యాణ్ వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఉన్నారు. రాజవోలు గ్రామపంచాయతీ నుంచి తిరిగి వస్తూ పవన్ కళ్యాణ్ రాజమండ్రిలో కీలకమైన ఆవాఎల్ చానల్ ను పరిశీలించారు. ఎస్టీపీ నుంచి వచ్చే ఈ ఛానెల్ పూర్తిగా వ్యర్ధాలతో నిండిపోయి ఉండటంపై పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ లను పిలిచి కాలువలో వ్యర్ధాలు పేరుకుపోకుండా, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్ధాలు నిలిచిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో స్వచ్ఛరథాలు మాదిరిగా అర్బన్ ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. భారీగా ప్లాస్టిక్ వ్యర్ధాలు ఎందుకు పేరుకు పోతున్నాయనే విషయం మీదా, ఆ సమస్య మీద ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. దీనికి ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందుతుందని, వెంటనే ఛానల్ సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు.





# విద్యార్థుల్లో టెక్నాలజీ నైపుణ్యాల పెంపుకు AI & రోబోటిక్స్ శిక్షణ దోహదం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందించడం లక్ష్యం
- AI, రోబోటిక్స్ రంగాల్లో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శిక్షణ

**పెద్దపల్లి, మే-26( సమయం న్యూస్). :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), రోబోటిక్స్ మరియు డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన "సూపర్ సమ్మర్ కంప్యూటర్, AI & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్" ఎంతో దోహదపడిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. టి-ఫైబర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఏప్రిల్ 27 నుండి మే 26 వరకు నెల రోజులపాటు మంథని, పెద్దపల్లి, రామగుండం మరియు సుల్తానాబాద్ కేంద్రాలలో నిర్వహించగా, మొత్తం 312 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కేంద్రంలో ఆరు రోజుల పాటు కంప్యూటర్, (AI) రోబోటిక్స్ మరియు డిజిటల్ స్కిల్స్ పై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "పెద్దపల్లి జిల్లాAI & రోబోటిక్స్ స్టూడెంట్ షోకేస్ -- 2026" లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల నుండి ఎంపికైన విద్యార్థులు తమ ప్రాజెక్టులు, రోబోటిక్స్ నమూనాలు, (AI) ఆధారిత వినూత్న ఆలోచనలు మరియు డిజిటల్ స్కిల్స్ ప్రజెంటేషన్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తు సాంకేతికత ఆధారిత ప్రపంచంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక విద్యలో ముందుండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం మరియు సాంకేతిక అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించి భవిష్యత్తులో (AI)రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సర్టిఫికెట్లు మరియు మెమెంటోలు అందజేసి సత్కరించారు. జిల్లా పరిపాలన అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు ఆహ్వానిత అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ మే26( సమయం న్యూస్). :** జిల్లాలో ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటును అందించాలి

- వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులను కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం




**నిజామాబాద్, మే 26 ( సమయం న్యూస్).** వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ(డీ.జీ.ఎఫ్.టీ), ఎ.పీ.ఈ.డీ.ఎ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎం.ఎస్.ఎం.ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీ.జీ.ఎఫ్.టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగించడం, మార్కెటింగ్ మెలుకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ, పసుపు, వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డీ.జీ.ఎఫ్.టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ.చవాన్ మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి మారకం బలపడుతుందని, ఇది ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు వర్తింపజేస్తూ, అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు. నేటి పరిస్థితుల్లో ఈ-కామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి, అవగాహనను పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఉంటున్న ప్రాంతం నుండే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ఉత్పత్తుల ఎగుమతులు, వ్యాపార లావాదేవీలు జరపవచ్చని సూచించారు. డీ.జీ.ఎఫ్.టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తామని అన్నారు. జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్.శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, కే.జనార్ధన్ రెడ్డి, ఎ.పీ.ఈ.డీ.ఎ అధికారి నాయుడు, నాబార్డు డీ.జీ.ఎం ఎస్.ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్‌లో 'సఖి కేంద్రం' ప్రారంభం

**హైదరాబాద్, మే 26( సమయం న్యూస్). :** మహిళా వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ "సఖి నివాస్", వన్ స్టాప్ సెంటర్ "సఖి కేంద్రం"ను మంత్రి సీతక్క ప్రారంభించారు.

మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే మహిళలకు సురక్షిత వసతి కల్పించేందుకు ఈ హాస్టల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# వరద విపత్తులపై ముందస్తు అప్రమత్తత అవసరం

- ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు పటిష్ట కార్యాచరణ
- ప్రణాళిక సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, మే 26( సమయం న్యూస్). :** రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కట్ ఆఫ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలని సూచించారు. 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రమాదకర రహదారులు, బలహీన చెరువు కట్టలు, పాత భవనాలు, విద్యుత్ ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వరదల అనంతరం వ్యాధుల నివారణకు పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు, రక్షణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

# కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ -- KJSKA అసోసియేషన్ ఇండియా




**సమయం న్యూస్ గజ్వేల్ 26-05-2026 :** KJSKA అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించబడింది. కరాటే విద్యార్థులు బెల్ట్ ప్రమోషన్ పరీక్షలో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం మరియు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ గ్రేడింగ్ పరీక్షను ప్రధాన పరీక్షాధికారి శ్రీ ఎం.డి. జహంగీర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

క్రింది విద్యార్థులు బ్లాక్ బెల్ట్‌లు పొందారు:
చింత మహేశ్వరి
ములుగు వర్ష
కె. అక్షిత
బీసీడీ రోహిత్ రెడ్డి
బీసీడీ వివేకానంద రెడ్డి

క్రింది విద్యార్థులు బ్లూ బెల్ట్‌లు పొందారు:
అభిరామ్
వైష్ణవి
అశ్విత

క్రింది విద్యార్థులు ఆరెంజ్ బెల్ట్‌లు పొందారు:
శ్రీహిత
శౌర్య
తన్వి
వర్ధిత

క్రింది విద్యార్థులు యెల్లో బెల్ట్‌లు పొందారు:
శ్రీ క్షేత్ర
విశాంత్ అద్వైత్
సంజీత్
సద్గుణ్

ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కరాటే మాస్టర్ నవీన్ బ్లాక్ బెల్ట్ 4వ డాన్ బ్లాక్ బెల్ట్‌ను సాధించారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మహిపాల్ రెడ్డి, సతీష్, హరీష్, రవి, రమేష్, దూలం వైకుంఠం, ప్రమోద్ శ్రీనివాస్ అందించిన విలువైన సహకారం, ప్రోత్సాహం ఎంతో కీలక పాత్ర పోషించాయి. వారు శిక్షణ మరియు పరీక్షా ప్రక్రియ అంతటా విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించి, విజయం సాధించిన వారందరికీ అభినందనలు తెలియజేసి వారి కృషి, పట్టుదలను ప్రశంసించారు. ఖజీంఖాూ అసోసియేషన్ ఇండియా అన్ని విద్యార్థులను వారి విజయాలకు అభినందిస్తూ, వారి మార్షల్ ఆర్ట్స్ ప్రయాణంలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తోంది. అలాగే కరాటే అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తున్న పరీక్షాధికారులు, శిక్షకులు, తల్లిదండ్రులు మరియు మద్దతుదారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

-- KJSKA అసోసియేషన్ ఇండియా

# చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయకుంటే ఢిల్లీలో ధర్నా: హరీశ్ రావు

**హైదరాబాద్, మే 26( సమయం న్యూస్) :** చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టీ.హరీష్ రావు. ఆరోపించారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, గిరిజనుల భూములను లాక్కొంటున్నారని విమర్శించారు. ఇందిరాపార్క్ వద్ద లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. భూముల కోసం పోరాడిన లంబాడీలపై కేసులు పెట్టి జైళ్లకు పంపించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములకు లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చిందని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేశిందని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు గిరిజన సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ప్రస్తుతం లబ్ధిదారులకు సహాయం అందడం లేదని విమర్శించిన హరీశ్ రావు, చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తండాల నుంచి పెద్ద ఎత్తున ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# మే 31 వరకు ఉపకార వేతనాలు దరఖాస్తు గడువు పొడిగింపు.

● జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్

**పెద్దపల్లి మే -26( సమయం న్యూస్). :** ఉపకార వేతనాలు దరఖాస్తు గడువు మే 31, 2026 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మండల. రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న అర్హులైన ఎస్సీ, విద్యార్థిని, విద్యార్థులు, 2025 - 2026 సంవత్సరానికి ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు గడువు పొడగిస్తున్నట్లు కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లోనీ విద్యార్థులు అందరూ వారి అర్హతలను బట్టి ఉపకార వేతనాలను www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని, మరిన్ని వివరాల కొరకు 8790153484 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



మల్కాజిగిరి నియోజకవర్గ మెంబర్షిప్ ఇన్‌చార్జ్‌గా నియమింపబడిన సందర్భంగా మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు గారిని కలసి హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన రాష్ట్ర ఎంబీసి కార్పొరేషన్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ శ్రీ నందికంటి శ్రీధర్ గారు.

# వైభవంగా 'ఎల్లమ్మ కథ' మహోత్సవం.



**పోతంగల్, మే 26 (సమయం న్యూస్ )** మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు స్థానికంగా అత్యంత వైభవంగా సాగుతూ గ్రామంలో ఆధ్యాత్మిక పండగ వాతావరణాన్ని తీసుకువచ్చాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు జై శ్రీ రామ్ కురుమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ మందిర ప్రాంగణంలో "ఎల్లమ్మ కథ" కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంప్రదాయ వాయిద్యాల మంగళధ్వనుల నడుమ కథకులు ఎల్లమ్మ తల్లి జీవిత విశేషాలను, ఆమె మహిమలను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించగా, తరలివచ్చిన జనసందోహం భక్తితన్మయత్వంతో ఆలకించింది. ఈ పవిత్ర దేవాలయ ప్రతిష్టాపనతో గ్రామానికి, ప్రజలందరికీ అంతా మంచే జరుగుతుందని కురుమ సంఘం నాయకులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ వైభవ మహోత్సవంలో కురుమ సంఘం అధ్యక్షులు హనుమాన్లు, ఉపాధ్యక్షులు నడిపి మల్గొండ, పెద్ద పీరుగోండ, లోని సాయిలు, చిన్న పీరుగోండ, ఎత్తోండ పీరుగొండ, మహిళలు, యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అర్ధరాత్రి చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, మే,26(సమయం న్యూస్) :** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, అక్రమ రవాణాల నియంత్రణ మరియు ప్రజలకు భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారు అర్ధరాత్రి ఆకస్మికంగా నారాయణపేటలోని ఎర్రగుట్ట చెక్ పోస్టును, దామరగిద్ద మండలంలోని కాన్కుర్తి బోర్డర్ చెక్ పోస్టును సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. చెక్ పోస్టుల వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీలు, రాత్రి పూట భద్రతా చర్యలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలనతో పాటు పాయింట్ బుక్ నమోదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.జిల్లాలో ఏర్పాటు చేసిన మొత్తం 07 చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే పోలీసులు, వెటర్నరీ డాక్టర్ లు 24ఐ7 అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారు మాట్లాడుతూ... బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అక్రమ మద్యం, గంజాయి, పశువుల అక్రమ రవాణా, పేలుడు పదార్థాలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు.అలాగే ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు.ఈ తనిఖీలలో సంబంధిత పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఘనంగా అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**ములుగు మే26( సమయం న్యూస్). :** తెలంగాణ ప్రభుత్వ లి'99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక'లిలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారిని శ్రీమతి ప్రేమలత గారి ఆధ్వర్యంలో ఈరోజు ములుగు జిల్లాలోని దేవగిరిపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆన్‌లైన్ (వర్చువల్) పద్ధతిలో ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానికంగా అత్యంత ఉత్సాహభరిత వాతావరణ ంలో జరిగింది. ఈ కార్యక్రమంలో క్రింది ముఖ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు:

ముఖ్య అతిథులు: దేవగిరిపట్నం సర్పంచ్ శ్రీమతి విస్లవత్ పూలమ్మ సంతోష్ గారు.

స్థలదాత: అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ధాత శ్రీ సానికొమ్ము రోషి రెడ్డి గారు.

ప్రజాప్రతినిధులు: వార్డు మెంబర్ శ్రీ బాలాజీ గారు.

అధికారులు: ములుగు ప్రాజెక్ట్ సీడీపీఓ (జణూా) శ్రీమతి కె శిరీష గారు, సెక్టార్ సూపర్వైజర్లు శ్రీమతి అనంతలక్ష్మి, రమాదేవి, కమరున్నీసాబేగం, మరియు సరస్వతి గారు జూనియర్ అసిస్టెంట్ సంపత్ గారు

అంగన్‌వాడీ సిబ్బంది: టీచర్లు వి. విజయలక్ష్మి, జి. కవిత, ూ. కవిత, ఆయా జే. రోజా ఈ డిజిటల్ ప్రారంభోత్సవంలో స్థానిక గ్రామస్తులు, తల్లులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పౌష్టికాహారం, ముందస్తు విద్యకు ఈ



కొత్త కేంద్రం ఎంతో దోహదపడుతుందని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు

# వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ --2026 ఘన విజేతలకు బహుమతుల ప్రదానం

**--క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజం**

**-- మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు**

**హైదరాబాద్, మే 26:** వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, హైదరాబాద్‌లోని ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలు విజయవంతంగా ముగిశాయి. అన్ని వయో విభాగాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, కోశాధికారి పీ.వి.ఎల్. కుమార్, ఏ.వి. రమణారెడ్డి, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జయంత్‌తో పాటు ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు కె. జయంత్, ఎం. మోహన్ రెడ్డి, జి.సి.ఆర్. రెడ్డి, ఎం. రామరాజు, వై. సాయి తేజ, నవీన్ వర్మ, వెంకట్, కిరణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడాకారులు విజయం--పరాజయాలను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమిని నిరాశగా కాకుండా పాఠంగా తీసుకుని, ప్రతిరోజూ కష్టపడి సాధన చేస్తే విజయాలు తప్పక సాధించవచ్చని అన్నారు. క్రీడల్లో



రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఆడుకోవడానికి తగిన స్థలాలు లేకుండా పోతున్నాయని, పాఠశాలలు అధికంగా వాణిజ్య ధోరణిలో నడుస్తుండటంతో పిల్లలకు క్రీడల అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడాకారులను ప్రోత్సహించే సంస్థలు, నిర్వాహకులను అభినందించారు.ప్రభుత్వాలు కూడా క్రీడాకారులకు మరింత సహాయ సహకారాలు అందించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువత క్రీడల వైపు మళ్లి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన కైవల్య అండర్-19 విభాగంలో ఛాంపియన్‌గా, అనేకళ్ల భావేష్ రెడ్డి జిల్లా అండర్-17 ఛాంపియన్‌గా, అద్వైత్ సత్తు జిల్లా అండర్-15 ఛాంపియన్‌గా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు.కార్యక్రమం అనంతరం విజేతలు, క్రీడాకారులు, నిర్వాహకులతో కలిసి అతిథులు స్మారక చిత్రాలు దిగారు. వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి ఈ పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామాల్లో సామాజిక మార్పే లక్ష్యం

**'మన పోలీస్ -- మన ఊరు' కార్యక్రమం**

సమయం న్యూస్ గజ్వేల్ మే 26

అహ్మదీపూర్ గ్రామంలో 25 సీసీటీవీ కెమెరాలు, ఆడియో మైక్ సిస్టమ్‌ను ప్రారంభించిన సిపి రష్మి పెరుమాల్, IPS సిద్దిపేట జిల్లాలోని గ్రామాలను మరింత సురక్షితంగా, పటిష్టంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్, IPS గారు 'మన పోలీస్ -- మన ఊరు' అనే వినూత్న సామాజిక పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సిపి గారు గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కమిషనర్ గారికి ఘనస్వాగతం పలికారు.

'సిద్దిపేట సురక్ష నేత్ర' - సీసీటీవీల ప్రారంభం

గ్రామ రక్షణే ధ్యేయంగా 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా అహ్మదీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు , ప్రధాన కూడళ్లను కవర్ చేస్తూ ఏర్పాటు చేసిన 25 సీసీటీవీ కెమెరాలను, అలాగే ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ఏర్పాటు చేసిన 14 మైకుల ఆడియో కనెక్టివిటీ సిస్టమ్‌ను సిపి రష్మి పెరుమాల్ గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్, IPS గారు మాట్లాడుతూ:"తమకు ఘనస్వాగతం పలికిన అహ్మదీపూర్ గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడానికే ఈ 'మన పోలీస్ -- మన ఊరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని. ప్రజలు తమ సమస్యలను పోలీసులతో ధైర్యంగా, స్వేచ్ఛగా పంచుకోవాలి. మీ సమస్యల పరిష్కారానికి పోలీసులు శాయశక్తులా కృషి చేస్తారు. ఒకవేళ సమస్యలు ఇతర శాఖలకు సంబంధించినవి అయితే, ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తాం అని తెలిపారు. ఈ రోజు ప్రారంభించుకున్న సీసీటీవీ కెమెరాలు గ్రామ రక్షణ కవచాలు. మొబైల్ ఫోన్‌ను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో, ఈ కెమెరాలను కూడా అంతే జాగ్రత్తగా మెయింటైన్ చేయాలి. వ్యాపార సంస్థలు, దుకాణాలు,



వ్యక్తిగత ఇళ్ల వద్ద కూడా సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అతి వేగం లాంటివి ప్రాణాలకే ప్రమాదం. వేసవి కాలంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్ల లోపలే పడుకోవాలని విలేజ్ పోలీస్ అధికారులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నారనీ తెలియజేశారు. ఇటీవల బెజ్జంకి ప్రాంతంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన గ్యాంగ్‌ను పోలీసులు విజయవంతంగా పట్టుకున్నారు. కాబట్టి, మహిళలు రాత్రి వేళల్లో మెడలో బంగారు ఆభరణాలు ధరించి ఇంటి బయట నిద్రించవద్దని సూచించారు. గ్రామంలో సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే డైల్ 100 కు ఫోన్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలి.ఈ వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడ ఆడుకుంటున్నారు అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. చిన్న పిల్లలు గ్రామంలోని చెరువులు, కుంటలకు ఈతకు వెళ్లేటప్పుడు.. ఖచ్చితంగా ఈత వచ్చిన పెద్ద మనుషులు తోడుగా ఉండాలి లేదా తగిన రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతే పంపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక గజ్వేల్ ఏసిపి నర్సింలు, గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఇనస్పెక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది అహ్మదీపూర్ గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల్లో "ప్రజా పాలన- ప్రగతి ప్రాణిక"లో భాగంగా..

- జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య పథకం-
- మరియు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన





**వికారాబాద్, మే,26(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య పథకం– మరియు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల పైన అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పురోహితులు,ఖ్వాజిలు పాస్టర్స్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సంక్షేమ అధికారిణి బి. కృష్ణవేణి మాట్లాడుతూ మన జిల్లాలో తెలిసీ తెలియక ఎక్కడో ఒకచోట బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని వాటిని ఆరి కట్టవలసిన బాధ్యత ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరి పైన ఉందని అదేవిధంగా మన వికారాబాద్ జిల్లా కు మారుమూల ప్రాంతాలు, ఎక్కువగా ఉండటం అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు నిరక్షరాస్యులుగా ఉండడంవల్ల పిల్లలకు చిన్నతనంలో పెండ్లిలు చేస్తే కలిగే ఆరోగ్య సమస్యల గురించి మరియు చట్టాల గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత వరకూ మన జిల్లాలో బాల్య వివాహ నిర్మూలనకు కృషి చేస్తున్నామని దానికి వివిధ శాఖల సమన్వయంతో బాలవివాహాలను నిలుపుదల చేస్తున్నామని చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే అమ్మాయికి కలిగే ఆరోగ్య సమస్యల గురించి ప్రతి గ్రామంలో ఏర్పాటుచేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ లో అవగాహన కల్పిస్తున్నామని అదేవిధంగా శాఖ తరపున కళాజాత బృందం వివిధ గ్రామాల్లో తిరిగి బాల్య వివాహాల పైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు . ముందుగా ఒక పెండ్లి చేయాలంటే పెళ్లి ముహూర్తం విషయమై ముందుగా అమ్మాయి తల్లిదండ్రులు పురోహితులను, ఖ్వాజిలను, పాస్టర్లను ఆశ్రయిస్తారు కాబట్టి మీరు అక్కడే అమ్మాయి యొక్క ఏజ్ సర్టిఫికేట్– బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్సి మెమోను ప్రామాణికంగా తీసుకొని సరియైన వయసు లేనట్లయితే అక్కడే మీరు బాల్య వివాహాన్ని నిలుపుదల చేసి. సంబంధిత శాఖ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వెంకటేష్ మాట్లాడుతూ, మన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లా మనదే కావడం చాలా బాధాకరమని ఇట్టి బాల్యవివాహాల నిర్మూలనకై గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాలని నెలకు లేదా అతి మూడు నెలలకు ఒకసారి అయినా మీటింగ్ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని , బాల్య వివాహాల నిర్మూలనకై ముఖ్యంగా ఆడపిల్లల చదువుతున్న స్కూల్లో వారి యొక్క హాజరు శాతాన్ని పరిశీలించి డ్రాప్స్ అవుట్స్ అధికంగా ఉంటే వారి ఇంటికి వెళ్లి డ్రాప్ అవుట్ కావడానికి గల కారణాలను పరిశీలించి తిరిగి వారు తరగతి గదిలో చేరే విధంగా చూసినట్లయితే బాల్య వివాహాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మనం బాల్య వివాహాన్ని నిర్ధారించడానికి ఆధార్ కార్డు ప్రామాణికం కాదని, బర్త్ సర్టిఫికెట్ కానీ, ఎస్ఎస్సి మెమోను ప్రామాణికంగా తీసుకోవాలని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించుకుని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అర్ధ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మన జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. కొంతమంది తల్లిదండ్రులు బాల్య వివాహాల పైన అవగాహన లేకుండా మా అమ్మాయికి పెళ్లి చేస్తుంటే అధికారులు వచ్చి తీసుకెళ్లారని దానికి మీ సహకారం కావాలని మా దగ్గరికి వస్తుంటారని అలాంటి వారికి మేము ఎప్పుడు సహాయ సహకారాలు అందివ్వనని మీ అమ్మాయికి చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడంఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయో వాళ్లకి వివరించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి మహోత్తరమైన కార్యక్రమానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ కాంతారావు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు బాల్య వివాహం చేస్తే వారికి శారీరక సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాల పైన అవగాహన లేకుండా వల్ల అతి చిన్న వయసులో గర్భం దాల్చడం వలన తల్లి బిడ్డలు ఇద్దరికీ ప్రమాదకరం అని తెలిపారు తీవ్ర పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనతతో మాత శిశువు మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచి బాల్య వివాహ నిర్మలన కు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి జానయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సంగమేశ్వర్, స్థానిక సి డి పి వో లు వెంకటేశ్వరమ్మ , మెహరున్నీసా, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ ,మిషన్ వాత్సల్య సిబ్బంది ,మహిళా సాధికారత కింది సిబ్బంది, సూపర్వైజర్లు జిల్లాలోని పురోహితులు, ఖ్వాజిలు పాస్టర్స్ మొదలగు వారు హాజరు కావడం జరిగింది.

## డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన

- ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడమే లక్ష్యం
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్



**నారాయణపేట, మే,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు స్వయంగా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా వివరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 18 ఫోన్ కాల్స్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ ప్రాంతాల్లో, బెల్ట్ షాప్ ల ఎక్కువగా నడుస్తున్నాయి అని, భూ తగాదాలకు సంబంధించిన సమస్యలు రావడం జరిగింది, ఆరుబయట మద్యం సేవిస్తున్నారు అని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని, డబ్బులు తీసుకొని ఇవ్వకుండా చీటింగ్ చేస్తూనారు, పలువురు తమ సమస్యలను తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా ఎస్పీ స్వయంగా నోట్ చేసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ అధికారుల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తుందని, ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాలను తరచూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎవరి కులం ఎంతో... వారికంత వాటా" సభ విజయవంతం చేయాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం దక్కాలి : గూని నందు



**రాయపోల్, మే 26 :** "ఎవరి కులం ఎంతో... వారికంత వాటా" అనే నినాదంతో జూన్ 5న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ–జేఏసీ రాయపోల్ మండల అధ్యక్షుడు గూని నందు పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం మండలంలోని అనాజీపూర్,మాంతూర్,రాం సాగర్ గ్రామలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు దక్కాల్సిన రాజ్యాధికారం, భూములు, సంపద కొద్ది శాతం అగ్రకులాల చేతుల్లో కేంద్రీకృతమైందని విమర్శించారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, బీసీ ఎస్సీ ఎస్టీ–జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఉద్యమం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడికి చేరుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని, అట్టడుగు వర్గాల గౌరవం కోసం ఈ ఉద్యమం కొనసాగుతోందన్నారు. చదువుకున్న యువత, ఉద్యోగులు, మేధావులు, విద్యావంతులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, జూన్ 5న సిద్దిపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే సభకు భారీగా హాజరై సామాజిక మార్పుకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు యాదగిరి, మహేష్, నితిన్, శ్రీను, బాలకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలు మార్కెట్లో ప్రచారంలో ఉన్న HT పత్తి విత్తనాలపై మోసపోవద్దు

జిల్లా వ్యవసాయాధికారి ఎం.జాన్ సుధాకర్,ఎం.ఎస్ సి (అగ్రి)నారాయణపేట

**నారాయణపేట, మే,26(సమయం న్యూస్) :** రైతన్నలకు తెలియజేయునది ఏమనగా, ప్రస్తుతం మార్కెట్‌లో ప్రచారంలో ఉన్న HT (Herbicide Tolerant) పత్తి విత్తనాలపై రైతులు మోసపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటివరకు భారత ప్రభుత్వం అనుమతించిన పత్తి విత్తనాలు BG--III / BT--III విత్తనాలు కావు, కేవలం BG--II / BT--II పత్తి విత్తనాలు మాత్రమే చట్టబద్ధంగా అనుమతించబడ్డాయి. HT (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేదు. ఈ పత్తి విత్తనాలను విత్తడం వలన కలుపు మందులు అధికంగా వాడాల్సి రావడం,పంట పెరుగుదల సక్రమంగా లేకపోవడం,దిగుబడులు తగ్గిపోవడం,రైతులకు అధిక ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలియజేయడమైనది. అదేవిధంగా, ఈ పత్తి విత్తనాలు విత్తిన పొలాల్లో కలుపు మందుల వాడకం వల్ల భూమి సారత తగ్గడం, పర్యావరణానికి హాని కలగడం, మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

HT పత్తి విత్తనాలపై చట్టపరమైన నిబంధనలు

Genetic Engineering Approval Committee (GEAC) అనుమతి లేకుండా ఈ పత్తి విత్తనాల ఉత్పత్తి, నిల్వ, విక్రయం మరియు వినియోగం చట్ట విరుద్ధం. ఇలాంటి విత్తనాలను విక్రయించినా లేదా రైతులు వినియోగించినా విత్తనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలోప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని,తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని,అనుమానం ఉన్న విత్తనాల గురించి వ్యవసాయ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించడమైనది. అనధికారికంగా ఈ పత్తి విత్తనాల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. --- జిల్లా వ్యవసాయాధికారి

నారాయణపేటఎం. జాన్ సుధాకర్, ఎం.ఎస్సి (అగ్రి)

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మే,26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళ వారము పరిగి నియోజకవర్గం లో సుల్తాన్ పూర్ వెంకట సాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ను స్తానిక శాసన సభ్యులు రామ్ మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఎక్కువ మంది హమాలిలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా మిలర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రంగం పల్లి వరి కొనుగోలు కేంద్రము ను పరిశీలించారు. ధాన్యం నిలువ ఉండకుండా ఎక్కువ మొత్తం లో వాహనాలను, హమాలిలను ఏర్పాటు చేసి మిల్లులకు వెంటనే తరలించాలని,ధాన్యం రవాణా, హమాలి, నిల్వ మరియు మిల్లింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరము పరిగి మండలం చిగురాల్ పల్లి ఎస్ ఎచ్ జి మహిళా సంఘం వర్క్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను బలోపేతం చేసేందుకు మహిళా సంఘ భవనాలను ఏర్పాటు చేస్తుందనిఈ సందర్బంగా అన్నారు. హెల్త్ సెంటర్, మహిళా సంఘం వర్క్ షెడ్ నిర్మాణ పనులు జూన్ 30 వరకు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. తదనంతరము పరిగి నందు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. కేజీ బివి ( పి ఎం సి ) నస్కల్ నిర్మాణ పనులను పరిశీలించారు. మీకున్న లక్ష్యం మేరకు స్కూల్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, పంచాయతి రాజ్ ఉమేష్ కుమార్, పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి, డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## "బాల్య వివహం -బతుకు ఆగం"

- బాల్య వివాహరహిత జిల్లాగా మార్చే లక్ష్యం తో జిల్లా బాలల సంరక్షణ..
- అవగాహన కల్పించి జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**దామరగిద్ద,మండలం, మే,26(సమయం న్యూస్) :** 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక,మహిళా వారోత్సవాలలో (25/05/2026 శీ 30/05/2026) భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో " బాల్య వివాహరహిత తెలంగాణ" అంశంలో భాగంగా నారాయణపేట జిల్లా ను బాల్య వివాహ రహిత జిల్లా గా మార్చే లక్ష్యం తో జిల్లా బాలల సంరక్షణ విభాగం మంగళ వారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కంసాన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ....చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్యపరమైన మరియు సామాజికపరంగా వచ్చే సమస్యలు వాటి వల్ల ఎదుర్కొనే ప్రమాదాలపై అదేవిధంగా మరియు చట్ట పరంగా వచ్చే సమస్యల గురించి అనగా బాల్యవివాహాల నిరోధక చట్టం ,బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, బాల్య వివాహాలకు పాల్పడినటువంటి లేదా ప్రోత్సహించినటువంటి వారిపై చట్టపరంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువుకోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదువు కొనసాగించడంపై దృష్టి పెట్టి వారికంటూ ఒక గుర్తింపు ఉండేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కాగా ఈ కార్యక్రమం "బాల్యవివాహం–బతుకు ఆగం" అనే థీమ్ తో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శివారెడ్డి, గ్రామ సర్పంచ్ , డీ ఆర్ డి ఓ వెంకట్ రాములు, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ,దామరగిద్ద తహసిల్దార్, ఎంపీడీవో, మద్దూరు,సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్స్,డీ సీ పీ యూ, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీను ఆదేశం.**



**మద్దూరు, కోస్గి,గుండుమాల్,, మండలాలు మే.26(సమయం న్యూస్)**
అదనపు కలెక్టర్ ఈ క్రింది పిపిసిలు మరియు రైస్ మిల్లులను మంగళవారం సందర్శించారు.

1) మద్దూరు మండలం, ధఘన్‌పూర్ పిఎసి
2) మద్దూరు మండలం, పల్లిర్ల పిఎసి
3) కోస్గి మండలం, మీర్జాపూర్ ఐకెపి
4) కోస్గి మండలం, చిన్నారం ఎఫ్‌పిఓ
5) కోస్గి మండలం, కోస్గి పిఎసి
6) గుండుమల్ మండలం, బోగారం పిఎసి
7) మద్దూరు మండలం, జాదరావుపల్లి శ్రీ ఇండ్స్.పర్యటన సందర్భంగా, రికార్డులను సరిచూసి, వరి సేకరణను వేగవంతం చేయాలని, వరి నిల్వలను వెంటనే తరలించాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. అలాగే, రైతులకు సకాలంలో ఎంఎస్‌పి చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంకా, వరి నిల్వలను ఎలాంటి ఆలస్యం లేకుండా అన్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిస్సి డిఎం,డిసిఎస్ఓ, డిసిఓ, మద్దూరు తహసీల్దార్ హాజరయ్యారు..

# గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందస్తు కార్యాచరణ

**రూ.1000 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధం**


**దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**



**కాళేశ్వరం, మే 26( సమయం న్యూస్). :** రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తమవుతోందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు.సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా మంగళవారం కాళేశ్వరంలో భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి ఆది, అంత్య పుష్కరాల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు.కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల నిర్వహణకు సుమారు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సరస్వతి పుష్కరాల్లో ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, వీఐపీ, వివిఐపీ పర్యటనల ఏర్పాట్లు వంటి అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సరస్వతి ఆది పుష్కరాల్లో పుష్కర ఘాట్లు, సరస్వతి విగ్రహం, టెంట్ సిటీ, వ్యాపార స్టాళ్లు, ఉచిత షటిల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి అంత్య పుష్కరాల్లో వన్‌వే ట్రాఫిక్ విధానం, అదనపు పార్కింగ్ ఏర్పాట్లు చేయడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఈ సమావేశంలో వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డిఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డి గారి ఎన్నిక రాష్ట్రానికి గర్వకారణం

- ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు వేం నరేందర్ రెడ్డి గారు
- రాష్ట్ర అభివృద్ధిలో సీఎం రేవంత్ రెడ్డి గారు రాకెట్ అయితే.. వేం నరేందర్ రెడ్డి గారు నిప్పురవ్వ



**హన్మకొండ మే26( సమయం న్యూస్) :** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గారి సన్మానోత్సవ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు విచ్చేసిన వేం నరేందర్ రెడ్డి గారికి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాకెట్‌లా ముందుకు దూసుకెళ్తుంటే, ఆ రాకెట్‌కు నిప్పురవ్వలా వేం నరేందర్ రెడ్డి గారు పనిచేస్తున్నారని కొనియాడారు. చిరునవ్వుతో, సహనంతో, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకుడు వేం నరేందర్ రెడ్డి గారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడంలో వేం నరేందర్ రెడ్డి గారి కృషి ఎంతో ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు కొండాసురేఖ, ధనసరి అనసూయ సీతక్క, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జాటోత్ రామ్ చందర్ నాయక్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాల్లో దేవాదాయ శాఖ కమిషనర్ పుష్కర స్నానం





**కాళేశ్వరం, మే 26( సమయం న్యూస్). :** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి అభిషేకం నిర్వహించగా, పార్వతీ దేవి ఆలయంలో అర్చనలు చేపట్టారు. అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో స్వామివారి దర్శనం వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్న దృష్ట్యా పరిశుభ్రత, భద్రత, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏడీసీ ఎం. కృష్ణవేణి, ఆర్‌జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ ఆర్. సునీత, ఆలయ ఈవో ఎస్. మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ వేళ విజుబుల్ పోలీసింగ్ వుండాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హన్మకొండ మే26( సమయం న్యూస్). :** బక్రీద్ పండుగ రోజున ప్రార్థన స్థలాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఎర్పాటు చేయడంతో పాటు, విజుబుల్ పోలీసింగ్ వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకోని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయము నుండి నిర్వహించిన ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ బక్రీద్ పండుగకు సంబంధించిన అంశంపై ముచ్చటిస్తూ బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేందుకు ముందుస్తు చర్యలు తీసుకోవాల్సి వుంటుందని. ముఖ్యంగా గోవుల పరిరక్షణకై పోలీస్ చెక్ పోస్టుల అప్రత్తంగా విధులు నిర్వహించాల్సి వుంటుందని. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన నాటి నుండి ఇప్పటి వరకు 11 కేసులు నమోదు కాబడ్డాయని, గతంలో కన్నా అధికమని. పండుగకు దృష్టిలో వుంచుకొని స్టేషన్ అధికారులు పీస్ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సంతల్లో జరిగే మగ జీవాల విక్రయాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి పెట్టాలని, గతంలో మత ఘర్షల్లో పాల్గోన్న పాత నేరస్తులను బైండోవర్ చేయడంతో, సోషల్ మీడియా నజర్ పెట్టాలని, తప్పుడు ప్రచారం చేసేవారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రధానం పండుగ రోజును దృష్టిలో వుంచుకోని పోలీసులు మరింత అప్రమత్తంగా వుండాలని. ముఖ్యంగా వధశాల్లో అపరిశుభ్రంగా లేకుండా, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తోలగించడంతో పాటు, వాటిని ఎక్కడపడితే అక్కడ డంపు చేయకుండా స్థానిక మున్సిపల్ సమన్వయంలో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు.

**రైతులు నష్టపోకుండా జాగ్రత్త పడాలి –వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై వుందని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం వీడియో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు ధాన్యం సేకరణ కేంద్రాల్లో సేకరించిన ధాన్యం నిల్వలు, రైతుల చెల్లింపులు, ధాన్యం రవాణా, గోదాముల నిల్వ సామర్థ్యంపై పోలీస్ కమిషనర్ సంబంధిత స్టేషన్ అధికారులను నుండి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ధాన్యం సేకరణ వేగం జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు, రవాణా అవసరమైన లారీల ఏర్పాటుకై పోలీస్ కమిషనర్ అధికారులకు పలుసూచనలు చేసారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, దార కవిత, ఏసిపిలు జితేందర్ రెడ్డి,జానీనర్సింహులు, దేవిడ్‌రాజు, ఇన్స్‌స్పెక్టర్లు సంజీవ్, ప్రవీణ్ కుమార్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గోన్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం, పీవీ స్వగృహంలోని ఫోటో మ్యూజియాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్




**భీమదేవరపల్లి: 26( సమయం న్యూస్). :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు.అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్యతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరుపల్లిలో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం

**గ్రామీణ పిల్లలకు మెరుగైన విద్య, పోషణ అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ జిల్లా, మే 26( సమయం న్యూస్). :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల రెండవ రోజు సందర్భంగా సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.8 లక్షలు, సీడీపీఓ ఆధ్వర్యంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మించారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త అంగన్వాడీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.వరంగల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 'స్నేహ' కార్యక్రమం ప్రారంభిస్తే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమల్లోకి వచ్చింది అన్నారు. మహిళలు, కౌమార దశలో ఉన్న చిన్నారుల సంక్షేమానికి "స్నేహ" కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు.పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత చిన్నారులకు మెరుగైన పోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతంతో పాటు చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ విజయలక్ష్మి డి డబ్ల్యూ రాజమణి ఖిలా వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ ఎంపీడీవో రమేష్ గుంటూరుపల్లి సర్పంచ్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతీ మంగళవారం భూభారతి పైన సమీక్ష

- దరఖాస్తుల పరిష్కారం లో ఇంకా వేగం పెరగాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ మే26( సమయం న్యూస్) :** భూ భారతి దరఖాస్తులను పరిష్కరించే అంశంపై ప్రతి మంగళవారం జరిగే సమీక్ష సమావేశం సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్ షాలోం ఈరోజు అన్నీ మండలాల తహసీల్దార్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించడంలో తహసీల్దార్లు, వారి సిబ్బంది విస్తృతంగా కృషి చేస్తున్నారన్నారు అనంతరం అన్నీ మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల విక్రయదారులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడులు

- నలుగురు అరెస్ట్,6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలు,వాహనం స్వాధీనం.
- టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె అన్వర్ పాషా
- అమాయక రైతులను మోసం చేస్తూ, నిషేధిత నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి-ఎస్పీ
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు





**దౌల్తాబాద్ మండలం, మే,26(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖూా ఆదేశాల మేరకు,వికారాబాద్ జిల్లాలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె అన్వార్ పాషా ఆధ్వర్యంలో విడివిడిగా జరిపిన రెండు వ్యూహాత్మక దాడులలో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మొదటి దాడిలో, పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం రావులపల్లి వద్ద నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న ఉప్పలపాటి వసంత రావు (37, వ్యాపారం, స్వస్థలం: బాపట్ల జిల్లా, ప్రస్తుతం నివాసం: యాద్గిర్ జిల్లా, కర్ణాటక) అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి 2.5 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన ఆక్టివా జూపిటర్ వాహనాన్ని (నెంబర్: ఖూా 33 జుజు 1467) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడైన యాణగుంది (సేడం, కర్ణాటక) గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అదేవిధంగా టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె అన్వార్ పాషా నేతృత్వంలో జరిగిన రెండో దాడిలో..దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో పునాకాల సురేష్ (40, వ్యవసాయం, స్వస్థలం: ప్రకాశం జిల్లా, ప్రస్తుతం నివాసం: సేడం, కర్ణాటక), కళ్యాణ్ వీరేష్ (43, వ్యాపారం, నివాసం: పాఖాల్, చందాపుర్, కర్ణాటక) మరియు తలారి వేణు (35, వ్యవసాయం, నివాసం: నీటూరు, దౌల్తాబాద్, వికారాబాద్ జిల్లా) ఉన్నారు. వీరి నుంచి సుమారు 4.2 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకుంది. ఈ ముగ్గురు నిందితులను, విత్తనాలను తదుపరి దర్యాప్తు కోసం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు. మొత్తం మీద ఈ రెండు దాడుల్లో కలిపి 6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖూా మాట్లాడుతూ..అమాయక రైతులను మోసం చేస్తూ, నిషేధిత నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అక్రమ విక్రయాలపై నిరంతరం నిఘా ఉంటుందని, నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. సమర్థవంతంగా దాడులు నిర్వహించి నిందితులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె అన్వార్ పాషా మరియు వారి బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

## డీజీపీ సి.వి. ఆనంద్ ఎదుట జనజీవన స్రవంతిలో కలిసిన ఇద్దరు సీనియర్ నేతలు



**హైదరాబాద్ మే25( సమయం న్యూస్) :** నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు, బీహార్--జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శి పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ అలియాస్ సలై దా, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మేదర దానమ్మ అలియాస్ లత అలియాస్ పూనమ్ అలియాస్ జోబా తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఎదుట లొంగిపోయారు. ఈ ఇద్దరు కీలక నేతలు లొంగిపోవడం మావోయిస్టు పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా పార్టీకి మిగిలి ఉన్న తూర్పు ప్రాంతీయ బ్యూరో కూడా పతనం అంచుకు చేరిందని పోలీసులు పేర్కొంటున్నారు. లొంగిపోయిన వారిలో పసునూరి నరహరి హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందినవారు. 64 ఏళ్ల నరహరి చిన్ననాటి విద్యను సోమిడి ప్రభుత్వ పాఠశాలలో, అనంతరం కాజీపేట ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేశారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, వరంగల్‌లోని ఎల్బీ కళాశాలలో డిగ్రీలో చేరారు. అయితే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌తో అనుబంధం కారణంగా చదువును మధ్యలోనే మానేశారు .మేదర దానమ్మ సిపిఐ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పని చేశారు. ఆమె లత, పూనమ్, జోబా పేర్లతో పార్టీ కార్యకలాపాల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు భావజాలం విడిచి సాధారణ జీవితంలోకి రావాలని డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం అవసరమైన సహాయం అందిస్తామని పోలీసులు తెలిపారు.

## నేరాల నియంత్రణకై నాకా బందీ నిర్వహిస్తాం-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మే26( సమయం న్యూస్) :** నేరాల నియంత్రణతో పాటు పాత నేరస్తులను గుర్తించేందుకు నాకా బందీ తనిఖీలు నిర్వహిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిన్నటి రోజున వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు చేపట్టిన నాకాబందీ తనీఖీల్లో పోలీసులు మొత్తం 11,286 వాహనాలను తనిఖీ చేయబడ్డాయని ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 5626 వాహనాలు, ఈస్ట్‌జోన్ పరిధిలో 2591, వేస్ట్ జోన్ పరిధిలో 2057, ట్రాఫిక్ పరిధిలో 992 వాహనాలను తనిఖీ చేయగా, వివిధ కారణాలతో 275 వాహనాలను సీజ్ చేయబడ్డాయని. దీనితో పాటు ఈ తనిఖీల్లో మద్యం సేవించి 197 మంది వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడటం జరిగిందని. వీటితో పాటు శాయంపేట పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై రెండు కేసులు నమోదు కాగా, దామెర పోలీస్ స్టేషన్ అక్రమ మద్యం తరలిస్తున్న వారిపై పోలీసులుయ రెండు కేసులు నమోదు చేయగా, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అనుమానిత వ్యక్తిని అదుపు తీసుకోవడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన తెలిపారు.



ఇటీవల జరిగిన హన్మకొండ జిల్లా శాఖ ఎన్నికల్లో గెలిచిన నూతన అధ్యక్షులు గడ్డం కేశమూర్తి,కార్యదర్శి సాయిరాం, కోశాధికారి డాక్టర్ విష్ణువర్ధన్ లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ,రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రదానం కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్లా అమర్,

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

-- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

-- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సూర్యాపేట మే26( సమయం న్యూస్). :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఉద్యోగ అవకాశాలు. జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

**పెద్దపల్లి, మే - 26( సమయం న్యూస్). :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ద్వారా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దుబాయ్) లో వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్‌ను తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నారు. యు.ఏ.ఇ లో టైల్ మేసన్స్, షట్టరింగ్ కార్పెంటర్, ఆర్‌సిసి వర్కర్, స్టీల్ ఫిక్సర్, స్కాఫోల్డర్, జనరల్ హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు అవసరమని పేర్కొన్నారు. టెక్నికల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ాజుణ 1453 (సుమారు ×చీ= 37,800/-) జీతం, ఫుడ్ అలవెన్స్, అటెండెన్స్ బోనస్ కల్పించబడుతుందని, జనరల్ హెల్పర్ పోస్టులకు ాజుణ 1200 (సుమారు ×చీ= 31,200/-) జీతం అందించబడుతుందని, అభ్యర్థులకు కనీసం 1 సంవత్సరం అనుభవం ఉండాలి ఫ్రెషర్స్ కూడా జనరల్ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, కంపెనీ వారే వసతి, రవాణా సదుపాయాలను కల్పిస్తారని, ప్రారంభ ఒప్పంద కాలం (కాంట్రాక్ట్) 2 సంవత్సరాలు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ నవీకరించిన రెజ్యూమేను శీఎషీఎ.తీవంబఎవఏస్త్రమ్ఖుఅశ్రీ.షీఎ కు పంపాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ని సందర్శించవచ్చని, 8328602231, 9440050951 , 9440051452 ఫోన్ నంబర్ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఫిల్ సాల్ట్ కమ్‌బ్యాక్‌పై సస్పెన్స్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మంగళవారం జరగబోయే క్వాలిఫైయర్ 1 మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ తో తలపడనుంది. గాయం కారణంగా లీగ్ దశలో చాలా మ్యాచ్‌లకు దూరమైన ఇంగ్లండ్ ఎక్స్‌ప్లోజివ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ అవైలబిలిటీపై ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ స్పందించాడు. వేలి గాయానికి లండన్ లో ట్రీట్‌మెంట్ చేయించుకుని ఇండియాకు తిరిగొచ్చిన సాల్ట్ ప్రస్తుతం ఫిట్‌గా ఉన్నాడని, ప్రాక్టీస్ సెషన్స్ లో పాల్గొంటున్నారని చెప్పాడు. అయితే తుది జట్టును ఇంకా ఖరారు చేయలేదని, మ్యాచ్ టైమ్‌లోనే నిర్ణయం తీసుకుంటామని పాటిదార్ స్పష్టం చేశాడు. లీగ్ లో సాల్ట్ ప్లేస్ లో వచ్చిన జేకబ్ బెథెల్ పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. ఆఖరి లీగ్ మ్యాచ్ లో ఓపెనర్‌గా వచ్చిన వెంకటేష్ అయ్యర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ పై క్విక్ ఫైర్ ఇన్నింగ్స్ ఆడి ఆకట్టుకున్నాడు. ప్రీ-మ్యాచ్ ప్రెస్ మీట్ లో రజత్ పాటిదార్ మాట్లాడుతూ, ఐపీఎల్ లో ప్రతి మ్యాచ్ లోనూ 200 ప్లస్ స్కోర్లు నమోదు అవుతుండటంతో బౌలర్లు మనుగడ సాగించడం చాలా కష్టంగా మారుతోందని అంగీకరించాడు. ఇప్పుడున్న రోజుల్లో 220 నుండి 250 పరుగుల స్కోర్లు కూడా సురక్షితం కాకపోవడం ఫాస్ట్ బౌలర్లకు పెద్ద ఆందోళనకరమైన విషయమని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం పిచ్‌లు అన్నీ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో పాటు బౌండరీలు చిన్నగా ఉండటం, మంచు ప్రభావం చూపడం బౌలర్లకు పెద్ద సవాల్‌గా మారాయని చెప్పాడు. బౌలర్లు చిన్న తప్పు చేసినా బ్యాటర్లు సిక్సర్లుగా మారుస్తున్నారని, అయితే అందుబాటులో ఉన్న కండిషన్స్ లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వడానికే తాము ట్రై చేస్తామని పేర్కొన్నాడు. పిచ్ ఎలా ఉండాలనేది తమ చేతుల్లో లేదన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూరు నుండి అహ్మదాబాద్‌కు మార్చడంపై రేగిన వివాదం గురించి అడిగిన ప్రశ్నకు పాటిదార్ చాలా వ్యూహాత్మకంగా సమాధానమిచ్చాడు. ఈ షిఫ్టింగ్ అనేది తన కంట్రోల్ లో లేని విషయమని , అహ్మదాబాద్ స్టేడియం ఒక చారిత్రాత్మక ప్రదేశమని, ఫైనల్ ఎక్కడ జరిగినా తమ పూర్తి ఫోకస్ కేవలం మ్యాచ్ గెలిచి ఫైనల్ కు చేరడంపైనే ఉంటుందని స్పష్టం చేశాడు. మితిమీరిన టికెట్ రిక్వెస్ట్‌లు, లోకల్ పొలిటికల్ కాంప్లికేషన్స్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సమస్యల కారణంగానే బీసీసీఐ టైటిల్ పోరును అహ్మదాబాద్‌కు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. లీగ్ దశలో ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ రెండు జట్లు సమానమైన పాయింట్లతో టేబుల్ లో టాప్-2లో నిలిచాయి. ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించడం కోసం జరగబోయే ఈ పోరులో రెండు సమ ఉజ్జీ టీమ్స్ తలపడబోతున్నాయని పాటిదార్ అభివర్ణించాడు. ఈ సీజన్ లో ఇరు జట్లు అద్భుతమైన పర్ఫార్మెన్స్ చూపించాయని చెప్పాడు. మంగళవారం జరిగే మ్యాచ్ రోజున ఏ టీమ్ అయితే తమ ప్లాన్స్ ను గ్రౌండ్ లో పక్కాగా ఇంప్లిమెంట్ చేస్తుందో, అలాగే మ్యాచ్ ప్రెజర్‌ను తట్టుకుని ప్రశాంతంగా ఒత్తిడిని అధిగమిస్తుందో ఆ జట్టునే విజయం వరిస్తుందని రజత్ పాటిదార్ ధీమా వ్యక్తం చేశాడు.



## టీ20ల్లో 200 పరుగులే లక్ష్యం

**ముంబై, మే 26 :** ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన భవిష్యత్ లక్ష్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 క్రికెట్‌లో వ్యక్తిగతంగా 200 పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సీజన్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్న వైభవ్, ప్రస్తుతం టీ20ల్లో ఉన్న అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును బద్దలు కొట్టాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. 2013 ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన గేల్, పూణె జట్టుపై అజేయంగా 175 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. ఆ రికార్డును అధిగమించాలని ఉందా అని ప్రశ్నించగా వైభవ్ సూటిగా స్పందించాడు. తాను ఆ రికార్డును తప్పకుండా బ్రేక్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు. ఒక మ్యాచ్‌లో పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభిస్తే 200 పరుగులు సాధించడం అసాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశాడు. యువ ఆటగాడి ఈ ధైర్యవంతమైన లక్ష్యం ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఐపీఎల్‌లో తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైభవ్, భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# దర్జాగా ఫైనల్‌కు ఆర్‌సీబీ!






- క్వాలిఫయర్ 1 లో గుజరాత్ పై 92 పరుగుల భారీ తేడాతో విజయం
- 33 బంతుల్లో 93 పరుగులతో విధ్వంసం సృష్టించిన రజత్ పాటిదార్
- ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన కృనాల్ పాండ్య
- ఓడినా క్వాలిఫయర్ 2 ద్వారా గుజరాత్ కు మరో అవకాశం

హెచ్ పీ సీ ఏ స్టేడియంలో మే 27 న జరిగిన ఐ పీ ఎల్ క్వాలిఫయర్ 1 మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ కీలక పోరులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి ఏకంగా 92 పరుగుల తేడాతో గెలుపొంది దర్జాగా నేరుగా ఫైనల్ కు దూసుకెళ్లింది.

### బ్యాటింగ్ లో ఆర్ సీ బీ విశ్వరూపం

టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన ఆర్ సీ బీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 33 బంతుల్లోనే అజేయంగా 93 పరుగులు సాధించి జట్టు భారీ స్కోరులో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా విరాట్ కోహ్లీ 25 బంతుల్లో 43 పరుగులు, కృనాల్ పాండ్య 28 బంతుల్లో 43 పరుగులు చేసి అద్భుతమైన సహకారం అందించారు. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్ 39 పరుగులిచ్చి 2 వికెట్లు, కగిసో రబాడ 54 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణకు 1 వికెట్ దక్కింది.



### చేతులెత్తేసిన గుజరాత్

255 పరుగుల కఠిన లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆదిలోనే తడబడింది. 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం చేస్తూ 43 బంతుల్లో 68 పరుగులు సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. జోస్ బట్లర్ 11 బంతుల్లో 29 పరుగులు, సాయి సుదర్శన్ 9 బంతుల్లో 14 పరుగులు చేసి నిరాశపరిచారు. ఆర్ సీ బీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి గుజరాత్ బ్యాటర్లను తీవ్రంగా కట్టడి చేశారు. జాకబ్ డఫీ 39 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, కృనాల్ పాండ్య 16 పరుగులిచ్చి 2 వికెట్లు, రసిఖ్ సలామ్ 24 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి జట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించారు. బ్యాటింగ్ లో పరుగులతో పాటు బౌలింగ్ లోనూ వికెట్లు తీసి అదరగొట్టిన కృనాల్ పాండ్య ఆర్ సీ బీ విజయానికి బలమైన బాటలు వేశాడు. 93 పరుగులతో వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన రజత్ పాటిదార్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

### గుజరాత్ కు మరో ఛాన్స్

ఐ పీ ఎల్ ప్లే ఆఫ్ నిబంధనల ప్రకారం క్వాలిఫయర్ 1 లో గెలిచిన ఆర్ సీ బీ నేరుగా ఫైనల్ కు చేరుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన గుజరాత్ టైటాన్స్ కు టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం లేదు. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచినందున వారికి ఫైనల్ చేరేందుకు మరో అవకాశం ఉంటుంది. ఎలిమినేటర్ మ్యాచ్ లో గెలిచిన జట్టుతో గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్ 2 లో తలపడుతుంది. ఆ మ్యాచ్ లో గెలిస్తే వారు కూడా ఫైనల్ కు చేరుకుంటారు.





# అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఊహించని పరిణామం!?

భారత క్రికెట్ జట్టు యువ పేసర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జరిగిన ఒక ఊహించని పరిణామం ఇప్పుడు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైదానంలోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఎంతో చురుగ్గా ఉంటూ అభిమానులను అలరించే ఈ స్పీడ్‌స్టర్, తాజాగా తన ఖాతా నుంచి ఏకంగా 200కు పైగా పోస్టులను తొలగించి అందరికీ పెద్ద షాక్ ఇచ్చాడు. క్రికెట్ ప్రపంచంలో అర్ష్‌దీప్ సింగ్ ఆటతీరుతో పాటు ఆయన చేసే వినోదాత్మక వీడియోలకు, రీల్స్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. తీరిక సమయం దొరికినప్పుడల్లా తోటి ఆటగాళ్లతో కలిసి సరదాగా వీడియోలు చేస్తూ అభిమానులతో పంచుకోవడం ఆయనకు అలవాటు. అయితే, తాజాగా ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ పేజీని పూర్తిగా ప్రక్షాళన చేశాడు. ప్రస్తుతం ఆయన ఖాతాలో కేవలం 44 పోస్టులు మాత్రమే మిగిలాయి. అందులోనూ ఎక్కువ భాగం వివిధ వ్యాపార ప్రకటనలకు సంబంధించినవే కావడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ నెలలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో కలిసి అర్ష్‌దీప్ చేసిన ఒక ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. దాదాపు 15 మిలియన్లకు పైగా వీక్షణలు (వ్యూస్) సాధించిన ఆ అరుదైన వీడియోను సైతం అర్ష్‌దీప్ ఇప్పుడు తొలగించాడు. దీంతో ఆరాధ్య ఆటగాడికి అసలు ఏమైంది? ఎందుకిలా పాత జ్ఞాపకాలన్నింటినీ చెరిపేస్తున్నాడంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక బలమైన కారణాలే ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అర్ష్‌దీప్ సోషల్ మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా అది కాస్తా వివాదాలకు దారితీస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన విమాన ప్రయాణంలో ఉన్నప్పుడు తీసిన ఒక వీడియో తీవ్ర దుమారం రేపింది. ఆ వీడియోలో తోటి ఆటగాడు యుజ్వేంద్ర చాహల్ ఈ-సిగరెట్ (వేపింగ్) కాలుస్తూ కెమెరాకు దొరికిపోయాడు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీయడంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీవ్రంగా స్పందించింది. లీగ్ మ్యాచ్‌లు ముగిసేవరకు సోషల్ మీడియాలో ఎలాంటి వీడియోలు చేయకూడదంటూ అర్ష్‌దీప్‌ను గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగానే, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు అర్ష్‌దీప్ పంచుకున్న మరో వీడియో వివాదాన్ని మరింత పెద్దది చేసింది. తోటి ఆటగాడు తిలక్ వర్మ చర్మ రంగును ఉద్దేశిస్తూ 'ఓయ్.. అంధేరా' (చీకటి) అంటూ అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. జాతివివక్ష పూరిత వ్యాఖ్యల కిందకు ఇవి వస్తాయంటూ నెటిజన్లు అర్ష్‌దీప్‌పై మండిపడ్డారు. ఈ వరుస వివాదాల నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తమ ఆటగాళ్లపై కఠినమైన నిబంధనలు విధించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇకపై ఆటగాళ్లు తమ వ్యక్తిగత ఖాతాల నుంచి జట్టుకు సంబంధించిన ఎలాంటి వీడియోలను



పోస్ట్ చేయకూడదని, ఏవైనా ఉంటే ఫ్రాంఛైజీ అధికారిక ఖాతాల ద్వారానే విడుదల చేయాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మానసిక ఒత్తిడి వల్లే అర్ష్‌దీప్ తన పాత పోస్టులన్నింటినీ డిలీట్ చేసి ఉంటాడని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఐపీఎల్ 2026 సీజన్లో పంజాబ్ జట్టు ఆరంభంలో అద్భుతంగా రాణించినప్పటికీ, ఆ తర్వాత వరుస ఓటములతో ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే.

# ‘విశ్వంభర’పై పెరుగుతున్న ఉత్కంఠ




మెగాస్టార్ చిరంజీవి వరుస చిత్రాలతో సినీ అభిమానులను అలరిస్తున్న వేళ.. ప్రస్తుతం అందరి దృష్టి మాత్రం భారీ ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’పైనే నిలిచింది. ఇటీవల విడుదలైన ‘మన శంకర వరప్రసాద్ గారు’ ఘన విజయంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, వెంటనే దర్శకుడు బాబీతో మరో భారీ ప్రాజెక్ట్‌ను కూడా చిరంజీవి ప్రారంభించారు. ఇప్పటికే ఆ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతుండగా.. చాలా కాలం క్రితమే ప్రారంభమైన ‘విశ్వంభర’ మాత్రం ఇంకా విడుదల తేదీ ప్రకటించకపోవడంతో అభిమానుల్లో ఆందోళన పెరుగుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ‘విశ్వంభర’ మెగాస్టార్ కెరీర్‌లోనే అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, భారీ సెట్స్, విస్తారమైన నిర్మాణ వ్యయంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రారంభం నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్, పోస్టర్లతో ఆసక్తిని పెంచిన మేకర్స్.. ఆ తర్వాత మాత్రం పెద్దగా అప్‌డేట్స్ ఇవ్వకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందనే వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నప్పటికీ.. విడుదలపై మాత్రం స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మొదట ఈ చిత్రాన్ని వేసవి కానుకగా విడుదల చేస్తారనే ప్రచారం జరిగింది. కానీ ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్రణాళిక వాయిదా పడినట్టే కనిపిస్తోంది. దీంతో అభిమానులు సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ “సినిమా విడుదల ఎప్పుడు?”, “ఒక్క అప్‌డేట్ అయినా ఇవ్వండి”, “ఇంకెంతకాలం ఎదురుచూడాలి?” అంటూ ప్రశ్నిస్తున్నారు. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ‘విశ్వంభర’ ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని తెలుస్తోంది. ఫాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి అత్యున్నత స్థాయి దృశ్య ప్రభావాలు అవసరం కావడంతో.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు హాలీవుడ్ స్థాయి విజువల్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో చిత్రబృందం పని చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. మెగాస్టార్ సినిమా అంటే అభిమానుల్లో అంచనాలు ఎప్పుడూ ఆకాశాన్నంటుతాయి. అందులోనూ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కుతున్న ‘విశ్వంభర’పై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ ఒకవైపు కొత్త సినిమాలు వరుసగా ప్రకటిస్తుండగా.. మరోవైపు ఈ ప్రాజెక్ట్‌పై నిశ్శబ్దం కొనసాగడం అభిమానుల్లో కొంత అసంతృప్తిని పెంచుతోంది. ఇక మేకర్స్ త్వరలోనే విడుదల తేదీతో పాటు భారీ అప్‌డేట్ ఇస్తారని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



## అమ్మ జ్ఞాపకాలతో భావోద్వేగానికి గురైన
# శ్రీగౌరి ప్రియ

తెలుగు సినీ పరిశ్రమలో విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ మరోసారి వార్తల్లో నిలిచింది. సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన ‘వదలనే’ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు అందరినీ కదిలించాయి. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించిన ‘వదలనే’ పాట విడుదల కార్యక్రమంలో చిత్ర బృందం మొత్తం పాల్గొంది. ఈ సందర్భంగా వ్యాఖ్యాత స్రవంతి చొక్కారపు వేదికపై ఉన్న నటీనటులను ఉద్దేశించి “ఈ పాటలోని సాహిత్యాన్ని ఎవరికి అంకితం చేస్తారు?” అని ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే క్రమంలో శ్రీ గౌరి ప్రియ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. “నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు.. నాకు తెలుసు. ఈ పాటలోని ప్రతి లైన్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను” అంటూ ఆమె కన్నీటి గొంతుతో చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు మౌనంగా మారిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రేక్షకులు శ్రీ గౌరి ప్రియ ధైర్యాన్ని ప్రశంసిస్తూ స్పందిస్తున్నారు. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా కన్నుమూశారు. తల్లితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉండేదని ఆమె ఇప్పటికే పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించింది. కేవలం తల్లిగానే కాకుండా మంచి స్నేహితురాలిలా తనతో ఉండేదని, ప్రతి విషయాన్ని పంచుకునేదని చెప్పింది. తల్లి మరణం తర్వాత కొంతకాలం తీవ్ర మానసిక వేదన అనుభవించిన శ్రీ గౌరి ప్రియ.. ఆ బాధను అధిగమించి మళ్లీ తన నటనా ప్రయాణంపై దృష్టి పెట్టింది. ఇప్పటికే ‘మెయిల్’, ‘మోడర్న్ లవ్ చెన్నై’, ‘మ్యాడ్’, ‘రైటర్ పద్మభూషణ్’, ‘లవర్’, ‘హ్యాపీ రాజ్’ వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకులకు చేరువైన శ్రీ గౌరి ప్రియ.. ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ‘చెన్నై లవ్ స్టోరీ’తో పాటు ‘వీసా – వింటారా సరదాగా’, ‘బ్రో కోడ్’ వంటి చిత్రాల్లో నటిస్తోంది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై యువ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ‘అర్జున్ రెడ్డి’ భామ



ఒక్క సినిమా జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది అంటారు. కానీ కొన్నిసార్లు భారీ విజయంతో వచ్చిన గుర్తింపు కూడా నటీనటుల కెరీర్‌ను ఎక్కువ కాలం నిలబెట్టలేకపోతుంది. అలాంటి ఉదాహరణల్లో నటి షాలిని పాండే ఒకరు. యువ హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వచ్చిన ‘అర్జున్ రెడ్డి’ చిత్రం ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ సినిమాతో విజయ్ స్టార్ హీరోగా, సందీప్ స్టార్ దర్శకుడిగా ఒక్కరాత్రిలోనే మారిపోయారు. అదే చిత్రంలో అమాయకపు యువతిగా నటించిన షాలిని పాండే కూడా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. అయితే ఆమె కెరీర్ మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ‘అర్జున్ రెడ్డి’లో ప్రీతి పాత్రలో షాలిని చూపించిన అమాయకత్వం, భావోద్వేగ నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. తొలి సినిమాతోనే ఆమెకు మంచి భవిష్యత్తు ఉంటుందని సినీ వర్గాలు అంచనా వేశాయి. కానీ ఆ తర్వాత వచ్చిన అవకాశాలు మాత్రం ఆమె కెరీర్‌ను నిలబెట్టలేకపోయాయి. తెలుగు చిత్రాల్లో కొన్ని అవకాశాలు వచ్చినప్పటికీ అవి పెద్ద విజయాలను అందుకోలేదు. దీంతో ఆమెకు స్టార్ హీరోయిన్ స్థాయి దక్కలేదు. తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో కూడా షాలిని నటించింది. కానీ అక్కడ కూడా ఆమెకు అదృష్టం కలిసి రాలేదు. వరుసగా సినిమాలు చేసినప్పటికీ సరైన విజయాలు లేకపోవడంతో కెరీర్ నెమ్మదించింది. తర్వాత బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ భామ అక్కడ కూడా పలు చిత్రాల్లో నటించింది. కానీ హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. దీంతో ప్రస్తుతం ఆమెకు సినిమా అవకాశాలు తగ్గిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. సినిమాల్లో అవకాశాలు తగ్గినా సోషల్ మీడియాలో మాత్రం షాలిని పాండే మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. ఒకప్పుడు కాస్త బొద్దుగా కనిపించిన ఆమె ఇప్పుడు పూర్తిగా మారిపోయి సన్నగా, మరింత గ్లామరస్‌గా కనిపిస్తోంది. తరచూ ఫోటోషూట్లు చేస్తూ సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆధునిక దుస్తుల్లో, స్టైలిష్ లుక్స్‌తో ఆమె పంచుకుంటున్న ఫోటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఆమె షేర్ చేస్తున్న గ్లామర్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. “ఇంత అందంగా ఉన్నా అవకాశాలు ఎందుకు రావడం లేదు?”, “మళ్లీ మంచి కంబ్యాక్ ఇవ్వాలి” అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఆమె నటనకు సరైన పాత్రలు దొరకలేదని అభిప్రాయపడుతున్నారు. తొలి సినిమాతోనే స్టార్‌డమ్ అందుకున్నప్పటికీ.. ఆ తర్వాత వరుస ఫ్లాపులు షాలిని కెరీర్‌ను దెబ్బతీశాయి. అయినప్పటికీ ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లోనే ఉంది. ఇప్పుడు మళ్లీ సరైన కథ, బలమైన పాత్రతో తెలుగు తెరపైకి రావాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు. మరి షాలిని పాండే మరోసారి టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారుతుందా లేదా అన్నది చూడాలి.



# అనన్య నాట్యంపై ట్రోల్స్

బాలీవుడ్ నటి అనన్య పాండే మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన ‘లైగర్’ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడంతో విమర్శలు ఎదుర్కొన్న ఆమె.. ఇప్పుడు కొత్త ప్రేమకథా చిత్రం ‘చాంద్ మేరా దిల్’తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ తన ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో ‘కిల్’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న లక్ష్య లాల్వాని కథానాయకుడిగా నటించాడు. హైదరాబాద్ నగరాన్ని నేపథ్యంగా తీసుకుని కాలేజీ ప్రేమకథగా రూపొందిన ఈ సినిమా యువతను ఆకట్టుకునేలా రూపొందించామని చిత్రబృందం చెబుతోంది. అయితే ప్రస్తుతం సినిమా కంటే అందులోని ఒక నృత్య సన్నివేశమే ఎక్కువ చర్చకు దారితీస్తోంది. చిత్రంలో అనన్య పాండే చేసిన భరతనాట్య ప్రదర్శనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె నృత్య కదలికలు, హావభావాలు సంప్రదాయ భరతనాట్య శైలికి విరుద్ధంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. “భరతనాట్యాన్ని వినోదంగా మార్చేశారా?” అంటూ కొందరు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం దర్శకుడి ఆలోచన ప్రకారమే ఆ సన్నివేశాన్ని చిత్రీకరించారని సమర్థిస్తున్నారు. ఈ వివాదంతో నటి అనన్య పాండేతో పాటు దర్శకుడు వివేక్ సోనీ కూడా విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఆ నృత్య దృశ్యానికి సంబంధించిన చిన్న వీడియో క్లిప్ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతూ అనేక వ్యంగ్య చిత్రాలు, మీమ్స్‌కు కారణమవుతోంది. ముఖ్యంగా సంప్రదాయ నృత్య కళల అభిమానులు ఈ సన్నివేశంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక వసూళ్ల పరంగా చూస్తే.. ‘చాంద్ మేరా దిల్’ చిత్రానికి మిశ్రమ స్పందన లభిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. తొలి వారాంతంలో సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేదని సమాచారం. మొదటి మూడు రోజుల్లోనే రూ.15 కోట్ల మార్క్‌ను దాటలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ భారీ చర్చ సినిమాకు అదనపు ప్రచారంగా మారుతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతికూల స్పందన వచ్చినా, వైరల్ హడావుడి కారణంగా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఈ వివాదం సినిమా భవిష్యత్ వసూళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

## ఎపిక్ నుంచి ప్రియసఖి సాంగ్ విడుదల

’జీవితాన్ని మార్చేశావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతు చూపించావే పూల కడలి’ అంటూ వైష్ణవీ చైతన్యపై పొగడ్తలు కురిపిస్తున్నారు హీరో ఆనంద్ దేవరకొండ. వీరిద్దరూ ప్రధానపాత్రల్లో నటిస్తోన్న చిత్రం ’ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్’. మిడిల్‌క్లాస్ బయోపిక్’ ఫేమ్ ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి ’ప్రియసఖి..’ అంటూ సాగే పాటను టీమ్ విడుదల చేసింది. సురేశ్ బానిశెట్టి లిరిక్స్ రాయగా.. కేఎస్ హరిశంకర్ ఆలపించారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# అమరావతిపై వైసీపీ తప్పుడు ప్రచారం

- శరవేగంగా రాజధాని నిర్మాణ పనులు
- నిర్మాణ వ్యయాలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ
- అమరావతి భవిష్యత్తులో భారీ ఆదాయ వనరుగా మారుతుంది
- మంత్రి నారాయణ



**అమరావతి, మే 26 (మనసులో మాట) :** రాజధాని అమరావతి నిర్మాణంపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయం, కొత్త పార్లమెంట్ భవన నిర్మాణ ఖర్చులపై తప్పుడు లెక్కలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతి నిర్మాణాన్ని విమర్శించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ... అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల నివాస భవనాల నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల కోసం నిర్మిస్తున్న ఆరు టవర్లలో అధిక భాగం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. జూన్ నెల నుంచి దశలవారీగా భవనాలను సాధారణ పరిపాలన శాఖకు అప్పగించే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అమరావతి నిర్మాణంలో రైతుల పాత్ర కీలకమని పేర్కొంటూ... మొత్తం 30,760 మంది రైతులు 35,059 ఎకరాల భూమిని రాజధాని కోసం ఇచ్చారని తెలిపారు. అందులో ఇప్పటికే 30,079 మంది రైతులకు ప్లాట్లు కేటాయించామని చెప్పారు. కేవలం 681 మంది రైతులకు సంబంధించిన 524 ఎకరాల వ్యవహారం మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పటివరకు 63,342 కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని... మరో 7,482 రిజిస్ట్రేషన్లు మాత్రమే మిగిలి ఉన్నాయని వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని విమర్శించారు. అమరావతి నిర్మాణ పనులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని... ఇదే తరహాలో వైసీపీ నేతలు మాట్లాడితే ప్రస్తుతం వచ్చిన 11 సీట్లు కూడా భవిష్యత్తులో ఉండవని హెచ్చరించారు. నిర్మాణ వ్యయాలపై మాట్లాడిన మంత్రి నారాయణ... హైదరాబాద్ సచివాలయం నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.13,768 ఖర్చయిందని, కొత్త పార్లమెంట్ భవనానికి చదరపు అడుగుకు రూ.16,916 వ్యయం అయ్యిందని తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌కు చదరపు అడుగుకు రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు ఖర్చవుతోందని వివరించారు. భవిష్యత్తులో అమరావతి ద్వారా సంవత్సరానికి రూ.12 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని మంత్రి నారాయణ అంచనా వేశారు. అలాగే అమరావతిలో మిగిలే ఐదు వేల ఎకరాల భూమి ద్వారా తీసుకున్న రుణాలను కూడా తీర్చగలమని స్పష్టం చేశారు.

# టీడీపీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు

**ఈ మహానాడు గిన్నిస్ రికార్డు ఎక్కబోతోంది**

**టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా**



అమరావతి, మే 26: తెలుగుదేశం పార్టీ ఈసారి నిర్వహించే మహానాడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఎక్కబోతుందని ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్లలో పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడుతో అనుసంధానం కాబోతున్నారని పేర్కొన్నారు. మంగళవారంమంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. ఇప్పటివరకు 1851 క్లస్టర్లతో సాంకేతికంగా మ్యాపింగ్, అనుసంధానం పూర్తయిందని తెలిపారు. మిగతా 24 క్లస్టర్లలో నెట్ కవరేజ్ లేకపోవడంతో వారందరిని మండల కేంద్రాలకు తీసుకువచ్చి మహానాడులో పాల్గొనే విధంగా చేస్తున్నామని వివరించారు. మొత్తం 20 తీర్మానాలు రెండు రోజుల్లో పూర్తిచేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ తీర్మానాలపై రెండు రోజుల్లో 65 నుంచి 80 మంది వరకు మాట్లాడుతారని చెప్పారు. మహిళలే కేంద్రంగా ఈసారి మహానాడు జరగనుందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు వస్తాయని చెప్పారు. ఏపీలో అభివృద్ధికి, సంక్షేమానికి అడ్డుపడటం, రాజధాని అమరావతి, పోలవరంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మాట్లాడతామని అన్నారు. వైసీపీ హయాంలో చేసిన అరాచకాలపై కూడా మహానాడులో చర్చిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ వ్యవహరిస్తున్న తీరును కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. మహానాడులో జగన్ అండ్ కో ప్రజా వ్యతిరేక చర్యలపై చర్చించడంతో పాటు తీర్మానం కూడా చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు రాజకీయ తీర్మానం కూడా ఉ ంటుందని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు జరుగుతుందని చెప్పుకొచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. సాంకేతికంగా కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అనుసంధానం చేశామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# తనను కొనడం మీ తరం కాదు

**డబ్బుకు అమ్ముడు పోయే వ్యక్తిని కాదు**

**వైఎస్ అవినాశ్ రెడ్డికి బిటెక్ రవి సవాల్**



కడప, మే 26: తనను కొనడం వైఎస్ అవినాష్ రెడ్డి వల్ల కాదు కదా.. ఆయన సోదరుడు వైఎస్ జగన్ వల్ల కూడా కాదని పులివెందుల టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. డబ్బు విద వ్యామోహం, డబ్బు విద కక్కుర్తి కానీ తనకు లేదని.. అది వికు మాత్రమే ఉందంటూ వైఎస్ అవినాశ్ రెడ్డి సోదరులకు ఆయన చురకలంటించారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి సోమవారం బీటెక్ రవిపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై మంగళవారం కడపలో బీటెక్ రవి స్పందించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతి తీర్మానానికి మద్దతు ఇవ్వకుంటే రూ.15 కోట్లు ఇస్తామని చెప్పింది విరు కదా? అని కడప ఎంపీని ఆయన సూటిగా ప్రశ్నించారు. తాను గతంలో విజయ సాయిరెడ్డిని కలిసి ఉంటే గత ఆరు సంవత్సరాలుగా విరు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ వారిని ఈ సందర్భంగా బీటెక్ రవి నిలదీశారు. 2014లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ అవినాష్ రెడ్డి తనను ఉల్లిమెళ్లలోని తన తోట వద్దకు పిలిపించి కసునూరు ఎంపీటీసీ అంశంపై ఎందుకు చర్చించారన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య అంశంలో హైకోర్టులో సీబీఐ కేసును విత్‌డ్రా చేయడానికి తనతోపాటు ఆదినారాయణ రెడ్డికి బ్లాంక్ చెక్ ఆఫర్ చేయడం నిజం కాదా? .. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని క్యాంపుల్లోని అసంతృప్తుల వివరాలను తమకు చెప్పింది విరు కాదా? అంటూ వైఎస్ అవినాష్ రెడ్డికి ఈ సందర్భంగా బీటెక్ రవి ప్రశ్నలు సంధించారు. రాజశేఖర రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయిన తరువాత బీబీఎమ్‌కు వచ్చిన వర్క్‌ను రద్దు చేయించి.. తద్వారా రూ.15 కోట్ల కమిషన్ తీసుకుని ఇళ్లు కట్టుకున్నది విరని బీటెక్ రవి కుండబద్దలు కొట్టారు. అలాంటి నువ్వు.. నాపై మాట్లాడేదంటూ అవినాశ్ రెడ్డిపై బీటెక్ రవి నిప్పులు చెరిగారు. అరటి రైతుల కడుపు కొట్టి కమిషన్లు తీసుకున్న నేపథ్యం విదంటూ అవినాష్ రెడ్డి తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ఖబ రాజేశ్వర్ రెడ్డి, గణకణపల్లి కృష్ణారెడ్డిలను అడిగితే వి ఎర్రచందనం దొంగతనాల గురించి వివరిస్తా రన్నారు. వి తాటాకు చప్పుడులకు తాను భయపడేది లేదంటూ అవినాష్ రెడ్డికి బీటెక్ రవి స్పష్టం చేశారు. ఉలిమెళ్ల తోటలో ఏం జరగలేదని చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ అవినాష్ రెడ్డికి సవాల్ విసిరారు. ఇప్పటివరకు పుష్ప 1 మాత్రమే అయింది.. ఇంకా పుష్ప 2, పుష్ప 3 కూడా చూపిస్తామని అవినాష్ రెడ్డిని బీటెక్ రవి హెచ్చరించారు.

# లిక్కర్ స్కాంపై ఈడీ దూకుడు

**చెవిరెడ్డి కుటుంబానికి ఈడీ నోటీసులు**

**విచారణకు హాజరైన భార్య, కుమారుడు**

**ఆరోపణలు రాజకీయ కక్షతోనే అన్న మోహిత్ రెడ్డి**

**అమరావతి, మే 26:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై దృష్టి సారించిన ఈడీ అధికారులు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మంగళవారం ఈడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ సందర్భంగా తమ ఆస్తులకు సంబంధించిన వివరాలను ఈడీ అధికారులకు పూర్తిస్థాయి-ంలో అందజేసినట్లు మోహిత్ రెడ్డి తెలిపారు. దర్యాప్తుకు తమ కుటుంబం పూర్తిగా సహకరిస్తోందని పేర్కొన్నారు. తమపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమేనని, అక్రమ సంపాదనతో ఎలాంటి సంబంధం లేదని మోహిత్ రెడ్డి మీడియాకు తెలిపారు. ముడుపుల సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేశామనే ఆరోపణలు పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. తమపై నమోదైన కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఆరోపించారు. ఏపీ సిట్ కక్షపూరితంగానే కేసులు నమోదు చేసిందని మోహిత్ రెడ్డి విమర్శించారు. చట్టపరంగానే ఈ కేసులను ఎదుర్కొంటామని చెప్పారు. తమ కుటుంబ ఆస్తులన్నీ చట్టబద్ధమైన మార్గాల్లోనే సంపాదించినవేనని తెలిపారు.

లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే పలువురిని ఈడీ అధికారులు విచారిస్తున్న విషయం తెలిసిందే. మనీలాండరింగ్ కోణంలో ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ



కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈడీ విచారణ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నేతలపై నమోదవుతున్న కేసులు రాజకీయంగా కూడా ప్రభావం చూపుతున్నాయి. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.

# కొండంతా గోవింద నామస్మరణ..

**10 రోజుల్లో రికార్డు స్థాయి దర్శనాలు**



**తిరుమల, మే 26:** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల కొండ శ్రీవారి భక్తులతో కిటకిటలాడు తోంది. తిరుమలలో టీటీడీ రికార్డు స్థాయి దర్శనాలు. శ్రీవారి లడ్డు ప్రసాదాల విక్రయాలతో పాటు శ్రీవారి హుండీ ఆదాయం కూడా పెరిగింది. రికార్డు స్థాయిలో భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్న టిటిడి మెరుగైన సేవలు అందిస్తోంది. తిరుమల కలియుగ వైకుంఠం, శ్రీవారిని దర్శించు కునేందుకు నిత్యం కొండకు చేరే భక్తులతో కిటకిటిలాడే ప్రాంతం. ఇలా ఎప్పుడూ కొండ నిండా జనం ఉండే చోట వేసవిలో మరింత రద్దీ కనిపిస్తోంది. గత 10 రోజుల్లో వెంకన్న దర్శనానికి వస్తున్న భక్తులతో తిరుమల కిక్కిరిసిపోయింది. ఈ నెల 16 నుంచి 25 వరకు 10 రోజులుగా రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు పోటెత్తారు. 10 రోజుల్లో 8,84,426 మంది భక్తులకు టీటీడీ శ్రీవారి దర్శనం కల్పించింది. శ్రీవారి సేవల సమయంలోనూ భక్తులను స్వామి వారి దర్శనానికి టిటిడి అనుమతించింది. ఇక 10 రోజుల్లో 4,51,324 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా హుండీ ఆదాయం రూ 40.8కోట్లు పొందింది. రోజు సగటున శ్రీవారిని దర్శించుకున్న 88 వేల మంది భక్తులు కాగా రోజు సగటున శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4 కోట్లకు పైగానే టిటిడి ఖాతాకు జమ అయ్యింది. ఈ పది రోజుల్లో 24న అత్యధికంగా 98,058 భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25న హుండీ ఆదాయం రూ 4.92 కోట్లు వచ్చింది. మరోవైపు ఈనెల 23న 57,780 మంది భక్తులు మొక్కులో భాగంగా శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. ఇక తిరుమలలో అన్యూహంగా పెరిగిన భక్తుల రద్దీకి టిటిడి ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్న టీటీడీ యంత్రాంగం శ్రీవారి దర్శనాలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్ని శాఖలతో సమీక్ష నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగానే రికార్డు స్థాయిలో శుక్రవారం నాడు 83 వేల మందికి దర్శనం చేయించినట్లు ప్రకటించారు. అభిషేకం సమయంలోనూ భక్తులకు సర్వదర్శనం కల్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రవేశ క్యూలైన్లను మారుస్తున్న టీటీడీ జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసులు,విజిలెన్స్ సిబ్బందితో రాత్రింబవళ్లు పని చేసేలా టీటీడీ చర్యలు చేపట్టింది.

# బ్రిటిష్ వాళ్లకు ఊడిగం చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిది

**చరిత్ర మరచి జగన్ మాట్లాడుతున్నాడు: ఎమ్మెల్సీ భూమిరెడ్డి**



**అమరావతి, మే 26:** జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ వాళ్లకు సాయం చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిదని దుయ్యబట్టారు. స్వాతంత్య్ర ఉద్యమం సమయంలో బ్రిటీష్ వాళ్లకు జగన్ కుటుంబం ఆహారం సరఫరా చేసిందని తెలిపారు. బ్రిటీష్ వాళ్ల మన్ననల కోసం దేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా పనిచేశారని రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. రాజారెడ్డి బ్రిటీష్ సైన్యంలో చేరి వారి కోసం పనిచేయలేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. మంగపేట ముగ్గురాయి గనుల కోసం వెంకటనరసయ్యను జగన్ కుటుంబం హత్య చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్యం-ర వచ్చే వరకూ రాజారెడ్డి దేశాలు పట్టుకుని తప్పించుకుని తిరిగాడని మండిపడ్డారు. హత్య చేయించటంతో పాటు చేసిన వారికి సుపారీ చెల్లించకుండా మోసం చేసిన చరిత్ర వైఎస్‌దని భూమిరెడ్డి ఆక్షేపించారు. ఇంత ఘన చరిత్ర కుటుంబ నేపథ్యం ఉన్న జగన్.. శాంతి కాముకుడిగా మాట్లాడటం విడ్డూరమని ఎద్దేవా చేశారు.

# ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు

**ప్రమాదంలో ముగ్గురు మృతి**

**కాకినాడ, మే 26:** తూర్పుగోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోకవరం మండలం కొత్తపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలిశాల గ్రామానికి చెందిన ఎనిమిది మంది మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లారు. జగ్గంపేటలోని ట్రావెల్స్ నుంచి కృష్ణ అనే వ్యక్తి ఇన్నోవా వాహనాన్ని సెల్ఫ్ సర్వీస్ కోసం తీసుకొచ్చారు. ఆయనతో పాటు మరో ఏడుగురు ఆ వాహనంలో మారేడుమిల్లి వెళ్లారు. తిరిగొస్తుండగా.. కొత్తపల్లి శివారు జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండిపూడి వివేక్ (19), బల్లిలా పద్మ (19), గట్ల లక్కీ (3) మృతి చెందగా.. కృష్ణ, కందిగట్ల నాని, రామకృష్ణ దొర, దుర్గ, నవ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకు పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను





# స్థిరంగా బంగారం

## వెండి రేట్లూ యథాతథం

**హైదరాబాద్, మే 26 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ భయాలు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో గత కొన్ని రోజులుగా పసిడి ధరలు భారీ స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే మంగళవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పులు నమోదు కాలేదు. బులియన్ మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,59,390 వద్ద కొనసాగుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,110గా నమోదైంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,550 వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ధరలు కూడా స్థిరంగానే కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల వెండి ధర రూ.29,490గా ఉండగా.. కిలో వెండి ధర రూ.2,94,900 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో విలువైన లోహాలపై డిమాండ్ కొనసాగుతున్నప్పటికీ, దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం ధరల్లో పెద్దగా హెచ్చుతగ్గులు కనిపించడం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,390గా నమోదైంది. ఢిల్లీలో ఈ ధర స్వల్పంగా పెరిగి రూ.1,59,440 వద్ద ఉంది. ఇక చెన్నై, మధురై, కోయంబత్తూరు నగరాల్లో మాత్రం బంగారం ధరలు మరింత ఎక్కువగా ఉండి రూ.1,61,250గా నమోదయ్యాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు, అమెరికా డాలర్ మారకం విలువ, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బంగారం ధరలు మరికొంత కాలం అధిక స్థాయిలోనే కొనసాగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఏఐతో కోట్ల ఉద్యోగాలకు ముప్పు

## సౌరభ్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, మే 26 :** భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు రాబోయే సంవత్సరాల్లో తీవ్ర ముప్పు పొంచి ఉందని ప్రముఖ మార్కెట్ నిపుణుడు సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తుండటంతో, ప్రస్తుతం మనుషులు చేస్తున్న అనేక పనులను కంపెనీలు ఆటోమేట్ చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో కోట్లాది ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సౌరభ్ ముఖర్జియా.. ఏఐ ప్రభావం టెక్నాలజీ రంగానికే పరిమితం కాదని, భవిష్యత్తులో అన్ని రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం టెక్ కంపెనీల్లో కనిపిస్తున్న ఉద్యోగ కోతలు కేవలం ప్రారంభ సంకేతాలేనని, అసలు ప్రభావం ఇంకా ముందుందని వ్యాఖ్యానించారు. 2030 నాటికి భారత్‌లో సుమారు 1.8 కోట్ల వైట్ కాలర్ ఉద్యోగాలు ఏఐ కారణంగా మాయమయ్యే అవకాశముందని ఆయన అంచనా వేశారు. మరోవైపు కొత్తగా కేవలం 30 లక్షల టెక్ ఉద్యోగాలే సృష్టించబడతాయని పేర్కొన్నారు. ఈ లెక్కన దాదాపు 1.5 కోట్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోడింగ్, డేటా విశ్లేషణ, డిజిటల్ టాస్క్‌ల వంటి రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని సౌరభ్ చెప్పారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు మానవ వనరుల అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయని, ప్రస్తుతం ఇది 50 శాతం వరకు ప్రభావం చూపుతోందన్నారు. మరో రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ఈ స్థాయి 90 నుంచి 100 శాతం వరకు చేరే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఏఐ అభివృద్ధి కారణంగా కంపెనీలు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, అదే సమయంలో భారీ స్థాయిలో ఉద్యోగ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్స్, కస్టమర్ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం పెరుగుతోందని విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే కొందరు నిపుణులు మాత్రం ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగైనా, కొత్త తరహా అవకాశాలు కూడా పుట్టుకొస్తాయని చెబుతున్నారు. టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

# ఫెరారీ నుంచి తొలి పూర్తి ఎలక్ట్రిక్ కారు 'లూస్' ఆవిష్కరణ



**న్యూఢిల్లీ, మే 26 :** ప్రపంచ ప్రఖ్యాత లగ్జరీ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ ఫెరారీ తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించింది. 'లూస్' పేరుతో రూపొందించిన ఈ అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనం ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటలీ భాషలో 'లూస్' అంటే 'కాంతి' అని అర్థం. సుమారు ఆరున్నర లక్షల అమెరికన్ డాలర్ల విలువైన ఈ కారు.. ఫెరారీ చరిత్రలోనే తొలి ఫైవ్ సీటర్ ఎలక్ట్రిక్ మోడల్ కావడం విశేషం. ఈ కారును ప్రముఖ డిజైన్ సంస్థ లవ్‌ఫ్రమ్ సహకారంతో రూపొందించారు. కొత్త మోడల్‌కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభిస్తోంది. కారు డిజైన్‌ను చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఇది నిజమైన మాస్టర్‌క్లాస్ డిజైన్" అంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ కొంత మందగించిన పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా లగ్జరీ ఈవీ విభాగంలో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో లాంబోర్గిని, పోర్స్ వంటి కంపెనీలు ఎలక్ట్రిక్ మోడళ్ల ఉత్పత్తిని జాగ్రత్తగా కొనసాగిస్తున్నాయి. మరోవైపు చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ కూడా గ్లోబల్ లగ్జరీ ఈవీ మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ఫెరారీ సీఈవో బెనెడెట్టో విగ్నా మాట్లాడుతూ.. 'లూస్' కారును అభివృద్ధి చేయడానికి దాదాపు ఐదేళ్ల సమయం పట్టిందని తెలిపారు. ఈ కారులోని అన్ని కీలక సాంకేతిక భాగాలను సంస్థ స్వయంగా తయారు చేసిందని వెల్లడించారు. ఫెరారీ నిపుణుల వివరాల ప్రకారం.. 'లూస్' కారులో ప్రతి వీల్‌కు ప్రత్యేక ఎలక్ట్రిక్ మోటార్ అమర్చారు. ఈ కారు కేవలం 2.5 సెకన్లలోనే గంటకు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, విలాసవంతమైన డిజైన్, అధిక పనితీరు కలయికతో రూపొందిన ఈ మోడల్ లగ్జరీ ఈవీ విభాగంలో కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు



**ముంబై, మే 26 :** లాభాల స్వీకరణ, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. సోమవారం భారీ లాభాలు నమోదు చేసిన సూచీలు.. మంగళవారం గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో ఒత్తిడికి గురయ్యాయి. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం కూడా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి పెరగడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగించాయి. ఈ ప్రభావంతో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. గత సెషన్‌లో 76,488 వద్ద ముగిసిన సెన్సెక్స్.. మంగళవారం ఉదయం ప్రారంభంలోనే దాదాపు 250 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ మొదలుపెట్టింది. మధ్యాహ్నం కొంతమేర కోలుకున్నప్పటికీ, చివరి గంటల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మళ్లీ దిగజారింది. చివరకు సెన్సెక్స్ 479 పాయింట్లు కోల్పోయి 76,009 వద్ద ముగిసింది. అదే విధంగా నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే కొనసాగింది. రోజంతా హెచ్చుతగ్గుల మధ్య ట్రేడైన నిఫ్టీ చివరకు 118 పాయింట్లు పడిపోయి 23,913 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో కొన్ని షేర్లు మాత్రం మంచి లాభాలు నమోదు చేశాయి. ముఖ్యంగా ఎక్సైడ్ ఇండస్ట్రీస్, అదానీ పవర్, ఇన్ఫో ఎడ్జ్, అదానీ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు లాభాల్లో నిలిచాయి. మరోవైపు కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైల్ వికాస్ నిగమ్, కేన్స్ టెక్నాలజీ, టొరెంట్ ఫార్మా, అశోక్ లేలాండ్ షేర్లు నష్టాలు చవిచూశాయి. బ్యాంకింగ్ రంగ సూచీ అయిన బ్యాంక్ నిఫ్టీ దాదాపు 200 పాయింట్లు కోల్పోయింది. అయితే మధ్య తరహా కంపెనీల సూచీ అయిన నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం 332 పాయింట్లు పెరిగి మార్కెట్‌కు కొంత మద్దతు ఇచ్చింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయి మారకం విలువ వంటి అంశాలు రాబోయే రోజుల్లో దేశీయ మార్కెట్ల దిశను నిర్ణయించే అవకాశముంది.

# అమెజాన్ 'మెగా క్రికెట్ ఫెస్టివల్'




**న్యూఢిల్లీ, మే 26 :** క్రికెట్ అభిమానులు, స్పోర్ట్స్ లవర్స్ కోసం అమెజాన్ ఇండియా ప్రత్యేక 'మెగా క్రికెట్ ఫెస్టివల్'ను ప్రారంభించింది. మే 31, 2026 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక సేల్‌లో క్రీడా పరికరాలు, అభిమానుల కోసం ప్రత్యేక మర్చండైజ్, ఫిట్‌నెస్ ఉత్పత్తులు, కలెక్టిబుల్స్, స్మార్ట్ టీవీలపై 70 శాతం వరకు భారీ తగ్గింపులు అందుబాటులో ఉంచింది. ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులు ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్‌జీ, డీఎస్‌సీ, కోకాటూ, బోల్డ్ ఫిట్, నివియా, ప్లేయర్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై అదనపు రాయితీలు కూడా అందిస్తున్నారు. అలాగే ఐసీఐసీఐ బ్యాంక్తో భాగస్వామ్యంలో ఉన్న అమెజాన్ పే క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రైమ్ సభ్యులకు కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై అదే రోజు డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఈసారి కొనుగోలు అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ కృత్రిమ మేధ ఆధారిత సరికొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'రూఫస్' అనే ఏఐ అసిస్టెంట్ ద్వారా హింగ్లిష్‌తో పాటు భారతీయ భాషల్లో కూడా వినియోగదారులు తమ అవసరాలకు తగ్గ ఉత్పత్తులను సులభంగా వెతుక్కోవచ్చు. వయస్సు, వినియోగం ఆధారంగా సరైన క్రికెట్ బ్యాట్, జిమ్ గ్లోవ్స్ వంటి వస్తువులను సూచించే విధంగా ఈ ఫీచర్ పనిచేస్తోంది. అలాగే 'లెన్స్ ఏఐ' సదుపాయం ద్వారా కేవలం ఫొటో ఆధారంగా ఉత్పత్తులను గుర్తించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. 'రివ్యూ హైలైట్స్' ద్వారా వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకోవచ్చు. 'ప్రైస్ హిస్టరీ' ఫీచర్‌తో ధరల మార్పులను కూడా గమనించవచ్చు.

ఈ సేల్‌లో కొన్ని ప్రత్యేక ఆఫర్లు కూడా ఆకట్టుకుంటున్నాయి. కోకాటూ ఫుల్ క్రికెట్ సెట్ రూ.899కు, జస్పో ప్లాస్టిక్ బ్యాట్ రూ.329కు లభిస్తోంది. అలాగే విరాట్ కోహ్లి బాబుల్ హెడ్ కలెక్టిబుల్ రూ.749కు అందుబాటులో ఉంది. మ్యాచ్‌లను థియేటర్ అనుభూతితో వీక్షించాలనుకునేవారి కోసం షియోమి 55 అంగుళాల 4కే టీవీ రూ.51,999కు విక్రయిస్తున్నారు.

క్రికెట్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన ఈ ప్రత్యేక సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ఈ-కామర్స్ వర్గాలు చెబుతున్నాయి.

# ఎంఆధార్‌కు గుడ్‌బై.. కొత్త ఆధార్ యాప్‌లో అదిరిపోయే ఫీచర్లు

**న్యూఢిల్లీ, మే 26 :** యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఎంఆధార్ యాప్‌ను త్వరలో నిలిపివేసి, దాని స్థానంలో కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక డిజిటల్ ధృవీకరణ సదుపాయాలను అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన కొత్త ఆధార్ యాప్‌ను ఇప్పటికే దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. పాత ఎంఆధార్ యాప్‌కు భిన్నంగా ఇందులో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటివరకు ఆధార్ ధృవీకరణ సమయంలో పూర్తి ఆధార్ వివరాలు కనిపించేవి. దీంతో వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అవకాశం ఉండేది. అయితే కొత్త యాప్‌లో అవసరమైన సమాచారాన్ని మాత్రమే పంచుకునే విధంగా ప్రత్యేక సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త యాప్‌లో ప్రధాన ఆకర్షణగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఆధార్ షేరింగ్ ఫీచర్ నిలుస్తోంది. దీని ద్వారా పూర్తి ఆధార్ వివరాలను చూపించకుండా అవసరమైన సమాచారాన్ని మాత్రమే పంచుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, హోటళ్లు వంటి చోట్ల ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. అలాగే ఫేస్ ధృవీకరణ సదుపాయం కూడా ఇందులో అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు ఓటీపీ ఆధారంగా మాత్రమే యాక్సెస్ ఉండగా, ఇకపై ముఖ గుర్తింపు, క్యూఆర్ ధృవీకరణ ద్వారా కూడా ఆధార్ సేవలను వినియోగించుకోవచ్చు. దీంతో భద్రత మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక బయోమెట్రిక్ లాక్, అన్‌లాక్ సదుపాయాలను కూడా యాప్‌లో సులభతరం చేశారు. మొబైల్ నెంబర్, చిరునామా వంటి వివరాలను కూడా యాప్ ద్వారానే త్వరగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ సేవలను మరింత సురక్షితంగా, సులభంగా మార్చడమే ఈ కొత్త యాప్ లక్ష్యమని యూఐడీఏఐ వెల్లడించింది.

